ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 29 జూలై 2025



'సోమశిల'లో 30.525 టీఎంసీల నీరు

అనంతసాగరం జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటిమట్టం 30.525 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి 12,121 క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



పెద్దపులుల గాండ్రింపులు

- 2023లోనే పాదముద్రలు గుర్తించిన అటవీ శాఖ
- టైగర్ కారిడార్‌తో సంరక్షణ చర్యలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మెట్టప్రాంతం పొడవునా విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో పెద్దపులుల గాండ్రింపులు వినబడుతున్నాయి. ఇటీవల కాలంలో వాటి సంఖ్య పెరిగినట్లు అటవీ శాఖ గుర్తించింది. ఆత్మకూరు రేంజ్ పరిధిలోని వెంకటాపురం ప్రాంతంలో 2023లోనే మొదటిసారి పెద్దపులి పాదముద్రలను అధికారులు గుర్తించారు. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇంకేముంది.. మన అటవీ ప్రాంతంలో పులులు తిరుగుతున్నట్టు నిజమై, ఆ దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. దీనికి బలం చేకూర్చేలా 2024లో మర్రిపాడు మండలం కదిరినాయుడిపల్లి ప్రాంతంలో హైవేపై వేగంగా వెళుతున్నత ఓ కారుపై పెద్దపులి దాడి చేసిందని డ్రైవర్ తెలపడంతో అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు రేంజ్‌ల పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రెండు పులులు తిరుగుతున్నట్టు గుర్తించారు. దీంతో జిల్లాలో టైగర్ కారిడార్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. జిల్లాలో పులుల సంచారం పెరిగినట్లు నిర్ధారించుకొన్న కేంద్ర అటవీ శాఖ ఈ ఏడాది జనవరిలో దాదాపు లక్ష హెక్టార్లలో టైగర్ కారిడార్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకొన్నది. తిరుపతి జిల్లా శేషాచలం టైగర్ కారిడార్‌లో నెల్లూరు జిల్లాలోని మూడు రేంజ్‌లను కలుపుతూ నిర్ణయం తీసుకొన్నది.

• ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లాలో టైగర్ కారిడార్ ఏర్పాటు కావడంతో జిల్లా అటవీ శాఖ అధికారులు పులుల సంరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేశారు. అడవుల్లో వివిధ రకాల మొక్కలతోపాటు వన్యప్రాణులైన జింకలు, దుప్పిలు, కణితల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. అడవుల్లో నీటి తొట్టెల సంఖ్యను పెంచడం, కారిడార్ సమీప గ్రామాల్లో పులులు ఉన్నట్లు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడం, పులులు తిరిగే ప్రాంతాల్లో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటుకు జిల్లా అటవీ శాఖ అధికారులు చేపట్టారు.

250 సీసీ కెమెరాల నిఘా

రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతంలో ప్రత్యేకంగా టైగర్ సంరక్షణకు చర్యలు చేపట్టాము. వాటి కదలికలను తెలుసుకోవడం కోసం దాదాపు 250 సీసీ కెమెరాలను అమర్చాము. అంతేగాక నీటి తొట్టెలను ఎక్కువగా ఏర్పాటు చేశాము. హెచ్చరిక బోర్డులను పెట్టాము. కణితలు, దుప్పిలు, జింకల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాము. ఇలా పులుల సంరక్షణ చర్యలు చేపడుతున్నాము.

- మహబూబ్‌బాషా, డీఎఫ్‌వో

నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

'ఉపాధి'లో ఆకలి కేకలు

2 నెలలుగా శ్రామికులకు అందని నగదు

- రూ.56 కోట్ల మేర బకాయిలు

నెల్లూరు (జడ్పీ), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పనుల్లేని నిరుపేద కుటుంబాలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకమే జీవనాధారం. ఈ పథకం ద్వారా చేపట్టే పనులతో వచ్చిన కూలి పేదలకు మూడు పూటలా తిండికి లోటు లేకుండా చేస్తోంది. అయితే, గడిచిన ఏడెనిమిది నెలలుగా దినసరి వేతనాలు చెల్లించడంలో ఆలస్యమవుతోంది. ఒక్కో నిరుపేదకు రోజుకు రూ.100 నుంచి 200 మేర మాత్రమే కూలి గిట్టుబాటవుతోంది. అయితే ఈ డబ్బులు కూడా చెప్పిన సమయానికి ఇవ్వకుండా నెలన్నర, రెండు నెలలకుపైగా సమయం పడుతుండటంతో పేదఉ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

• జిల్లాలో 2.68 లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలో 3.66 లక్షల మందికి జాబ్‌కార్డులు ఉండగా, 2.68 లక్షల కార్డు దారులు మాత్రమే క్రమంతప్పకుండా ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఇంకుడుగుంతలు, ఊటకుంటలు, చెరువులు, పంటకాలువల్లో పూడికతీతలు, ఉద్యాన, వానపాముల ఎరువుల తయారీ తదితర పనులు చేయిస్తున్నారు. 15 రోజులకోసారి శ్రామికులకు వేతనాలు అందించాల్సి ఉంది. కార్డుదారులకు ఉన్న బ్యాంకు ఖాతాల ద్వారానే కేంద్ర ప్రభుత్వం కూలి నగదు జమ చేస్తోంది.



• మే 20 నుంచి ఆగిన వేతనాలు


జిల్లాలో ఉపాధి హామీ కూలి నగదు మే నెల 20వ తేదీ వరకు చెల్లించారు. ఇప్పటికీ రెండు నెలలకు పైగా గడుస్తున్నా వేతనాలు చెల్లించలేదు. దాదాపు రూ.56 కోట్ల మేర శ్రామికులకు చెల్లించాల్సి ఉంది. గత ఏడెనిమిది నెలలుగా వేతనాలు సక్రమంగా రావడంలేదని, నెలన్నర నుంచి రెండున్నర నెల సమయం పడుతోందని శ్రామికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తమ బాధలను అర్థం చేసుకుని అధికారులు కూలి వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- ఏఐఐబీ వర్కులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- జిల్లాలో రూ.26 కోట్ల పెండింగ్ బిల్లులకు మోక్షం
- పీఎంజీఎస్‌వై ఫేజ్-4 కింద కొత్త రహదారులకు ప్రతిపాదనలు
- కీలక రోడ్ల విస్తరణకు నిర్ణయం

గడిచిన కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంత రోడ్లకు మంచి రోజులొస్తున్నాయి. పెండింగ్ బిల్లులు చెల్లించి అసంపూర్తి రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కీలకమైన కనెక్టివిటీ రోడ్లను విస్తరించేందుకు కూడా సిద్ధమవుతోంది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

నెల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ఫండింగ్‌తో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను బాగు చేసేందుకు పనులు చేపట్టారు. అవసరం మేరకు సీసీ, బీటీ రోడ్లను వేశారు. ఈ ప్రాజెక్టు కింద జిల్లాకు రూ.310.64 కోట్లు కేటాయించారు. మొత్తం 374 కి.మీ పొడవున రోడ్లను నిర్మించేందుకు 196 వర్కులను మూడు ప్యాకేజీలుగా విభజించి పనులు మొదలుపెట్టగా, 2020 నాటికి చాలా వరకు పూర్తయ్యాయి. ఇప్పటికి రూ.232 కోట్లు ఖర్చు చేసి 158 వర్కులు పూర్తి చేశారు. మరో 11 వర్కులు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. మిగిలిన 27 వర్కులు ప్రారంభం కాలేదు. వైసీపీ ప్రభుత్వం ఏఐఐబీ పనుల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు పనులు ఆపేశారు. జిల్లాలో రూ.26 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఈ వర్కులను పూర్తి చేయాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే రూ.26 కోట్ల బిల్లులను అప్‌లోడ్ చేయగా, త్వరలోనే నిధులు విడుదల కానున్నాయి. ఆ వెంటనే పెండింగ్‌లో ఉన్న 11 పనులను పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కాగా గత ప్రభుత్వం పుణ్యమా అంటూ ప్రారంభం కాని వర్కులన్నీ రద్దయ్యాయి. ఏఐఐబీ ఫండింగ్‌తో చేపట్టిన 27 వర్కులు రద్దు కాగా వాటిని మరో పథకం కింద చేపట్టేలా పంచాయతీరాజ్ అధికారులు నిర్ణయించారు.



అధ్వానంగా ఉన్న సంగం - పల్లిపాళెం రోడ్డు

• కొత్త రోడ్లకు ప్రతిపాదనలు

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్-3 కింద 2023-24లో రూ.56.58 కోట్ల అంచనాలతో 8 రోడ్లు మంజూరయ్యాయి. అలానే మూడు వంతెనలను రూ.21.77 కోట్లతో మంజూరు చేశారు. ఈ వర్కుల్లో ఆరు రోడ్లను పూర్తి చేశారు. 86.56 కి.మీ గానూ 74.81 కి.మీ మేర బీటీ రోడ్లు నిర్మించారు. ఇందుకు రూ.43.38 కోట్లు ఖర్చు చేశారు. బ్రిడ్జీల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇదే క్రమంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్-4 కింద పంచాయతీరాజ్ అధికారులు తాజాగా ప్రతిపాదనలు పంపారు. ఏఐఐబీ ప్యాకేజీలో రద్దయిన 27 రోడ్లలో నుంచి పది రోడ్లను ఫేజ్-4 కింద చేర్చారు. త్వరలోనే వీటికి అనుమతులు మంజూరుకానున్నాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వం మరో ఉన్నత ఆలోచన కూడా ముందుకు తెచ్చింది. ఇప్పటి వరకూ కొన్ని కీలకమైన గ్రామీణ రహదారులు 3.50 మీటర్ల వెడల్పుతోనే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని ట్రాఫిక్‌ను బట్టి ఈ రోడ్లను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొన్నింటిని 5.50 మీటర్లకు, మరికొన్నింటిని 7.50 మీటర్లకు వెడల్పు చేసేలా చర్యలు మొదలయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదన లు పంపాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించింది.



లారీతో కార్మికులను కొడుతున్న సీఐ శ్రీనివాసరావు

కార్మికులపై లాఠీచార్జ్!

- పారిశుధ్య పనుల్లోకి ప్రైవేటు వ్యక్తులు
- అడ్డుకున్నందుకు పారిశుధ్య కార్మికుల అరెస్ట్
- స్టేషన్ బయట బైఠాయింపు.. లాఠీతో చెదరగొట్టిన వేదాయపాళెం సీఐ

నెల్లూరు (క్రైం/వైద్యం), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో జరుగుతున్న పారిశుధ్య కార్మికుల ఆందోళన సోమవారం ఉద్రిక్తతకు దారి తీసింది. అయ్యప్పగుడి సెంటర్‌లో ప్రైవేటు కార్మికులతో అధికారులు పనిచేయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఆందోళనకారులు భారీగా అక్కడకు చేరుకుని, అడ్డుకున్నారు. తమ పనులు ఇతరుల వద్ద చేయిస్తే సహించమని, తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ర్యాలీ చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే వేదాయపాళెం పోలీసులు అక్కడకు చేరుకొని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రూరల్ అధ్యక్షుడు దేశ మూర్తితోపాటు సుమారు 10 మంది నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో స్టేషన్ వద్దకు తరలివెళ్లి స్టేషన్ ముందు బైఠాయించి, నినాదాలు చేశారు. స్టేషన్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో సీఐ శ్రీనివాసరావు కార్మికులపై లాఠీ చార్జీ చేసి చెదరగొట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులపై సీఐ శ్రీనివాసరావు దురుసుగా లాఠీచార్జి చేయడం పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. సీపీఎం, సీఐటీయూ నేతలు కొండాప్రసాద్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, పెంచల నరసయ్య, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, సతీష్, నాగిరెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేడు పీఎంశ్రీ పాఠశాల ప్రారంభం

నెల్లూరు (విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యావిధానంలో భాగంగా జిల్లాలో పీఎంశ్రీ (పీఎం స్కూల్ ఫర్ రైజింగ్‌ఇండియా)కి ఎంపికైన 46 పాఠశాలల్లో కలిగిరి పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్ ఒకటి. దీన్ని కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపికైన అన్నీ పాఠశా లల్లో అత్యాధునికమైన వసతులతో విద్యాబోధన జరుగుతుందని, 2020 జాతీయ విద్యావిధా నాన్ని అనుసరించి ఈ కార్యక్రమాన్ని 2022 నుంచి దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు. గుణాత్మక విద్యను అందించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వ యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ పాఠశా లల్లో కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలతో పాటు అత్యాధునికమైన సాంకేతిక వసతులు కల్పిస్తుం దన్నారు. ఇందులో భాగంగా తొలుత ఓ పాఠశా లను వర్చువల్‌గా ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవడంతోపాటు ప్రారంభోత్సవాన్ని అందరూ తిలకించేందుకు పాఠశాలలో స్క్రీన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

వారిస్తున్నా.. మున్ముందుకే!

- 'మైనింగ్' వ్యవహారంలో అధికారుల తీరిది
- వరికుంటపాడులో తెల్లరాయి నిక్షేపాలు
- తవ్వకాలకు వ్యాపారుల విశ్వప్రయత్నం
- గ్రామస్థుల ఆందోళననూ పట్టించుకోని వైనం
- అధికార పార్టీ నేతల తీరుపై విమర్శల వెల్లువ

'మైనింగ్ జరిగితే తాము వీధిన పడితాము మహాప్రభో..!' అంటూ ఆ గ్రామస్థులు నెత్తి, నోరు కొట్టుకుంటున్నా అధికారుల ససేమిరా అంటున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, అమ్యామ్యాల కోసమో అనుమతుల పేరుతో వ్యాపారికి వంతపాడుతున్నారు. వరికుంటపాడు మండలంలోని అటవీ ప్రాంతాల్లో ఖనిజ నిక్షేపాలు అధికంగా ఉన్నాయనే ప్రచారంతో కొంతమంది వ్యాపారులు గత ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందామంటూ గ్రామాల వైపు పరుగులు తీస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్రజలు వ్యాపారులను అడ్డుకొని నిబంధనలకు విరుద్దంగా పొందిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపడుతున్నారు.

ఉదయగిరి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వరికుంటపాడు, భాస్కరాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 233, 1లోని 43 ఎకరాల కొండ పోరంబోకు భూముల్లో మైనింగ్ (తెల్లరాయి) తవ్వకాల కోసం 2023లో అప్పటి వైసీపీ హయాంలో లీజు అనుమతులు పొందిన వ్యాపారులు ఇప్పుడు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, ఈ భూములకు కూతవేటు దూరంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన ఎస్సీ వాసులతోపాటు సమీప వరికుంటపాడు, ఆంధ్రావారిపల్లి, కనియంపాడు గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గేదెలు, మూగజీవాలను నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాలకు కన్నతల్లితో సమానమైన ఆ కొండ పోరంబోకు భూముల్లో తవ్వకాలు సాగిస్తే తాము జీవనాధారం కోల్పోవలసి వస్తుందని వాపోతున్నారు.

• పంథా వీడని వ్యాపారులు

మైనింగ్‌ను గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నా వ్యాపారులు మాత్రం ఎలాగైనా పనులు ప్రారంభించి పట్టు నిలుపుకోవాలనే ధోరణితో ఉన్నారు. గతేడాది నవంబరులోనే కొంతమంది వ్యాపారులు కొండ ప్రాంతంలో యంత్రాలతో పనులు చేపట్టి బోరు పాయింట్లను వేయించారు. దీంతో విష యం తెలుసుకున్న గ్రామస్థులు మూకుమ్మడిగా అక్కడకు చేరుకొని పనులను అడ్డుకున్నారు. అప్పట్లో మిన్నకుండి పోయిన వ్యాపారులు మరోమారు అధికారుల సహకారంతో గ్రామానికి చేరుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఆ ప్రాంతాన్ని ఆనుకొని తమ నివాసాలతో పాటు పాఠశాల, ఆలయాలు ఉండడంతో బ్లాస్టింగ్ సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అధికారులకు విన్నవించారు. గేదెలు, మూగజీవాలకు మేత దొరికే పరిస్థితి కూడా లేకుండా పోతుందని వాపోయారు. అయినా ఈ నెల 24న ముందస్తు ఎలాంటి దండోరా వేయకుండానే కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ ఆధ్వర్యంలో కొండ ప్రాంతంలోనే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అక్కడ సైతం ప్రజలు తమ నిరసన గళాన్ని వినిపించినా ఏమాత్రం పట్టించుకొని అధికారులు పనులు చేపట్టేలా వ్యాపారులకు అనుకూలంగానే వత్తాసు పలకడం చర్చనీయాంశమైంది.



మైనింగ్ తవ్వకాలు సాగించనున్న కొండ ప్రాంతం

• అనుమానాలెన్నో

గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అధికారులు అనుమతులు మంజూరు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా మేత, కొండ పోరంబోకు భూముల్లో ఇచ్చిన అనుమతుల పుణ్యమా అని భవిష్యత్తులో పచ్చని ఆ ప్రాంతాలు ఎడారిగా మారే ప్రమాదం ఉంది. వ్యవసాయం, పాడిని నమ్ముకొని జీవించే ప్రజలు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. అయినా కొంతమంది వ్యాపారులు స్థానికుల అండతో అడ్డుకుంటున్న ప్రజలపై బెదిరింపులకు పాల్పడుతుండటం గమనార్హం. అంతేగాక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు వ్యాపారులకు అండగా నిలుస్తున్నారని అపవాదు ఉంది. దీనివెనుక ఓ ప్రజాప్రతినిధి చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. సమావేశాల సమయంలోను భారీస్థాయిలో పోలీసు బలగాలతో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా ఒకవంతైతే త్వరలోనే ఆ ప్రాంతంలో పనులు చేపట్టేందుకు వ్యాపారులు ప్రణాళికలు సాగిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అనుమతులు రావాల్సి ఉంది



ఇటీవల జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాము. భయందోళనకు గురయ్యామనే చెప్పే వారి నుంచి కూడా కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరించి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశాము. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు వచ్చిన తరువాత వ్యాపారులు పనులు ప్రారంభిస్తారు. అప్పుడు కూడా ప్రజల నుంచి ఆటంకాలు ఎదురైతే తమతోపాటు పోలీసుల ద్వారా పనులు జరిగేలా చర్యలు చేపట్టడం జరుగుతుంది.

- హేమంత్‌కుమార్, తహసీల్దారు, వరికుంటపాడు



కలెక్టర్‌ను కలిసిన సర్పంచు, జేఏసీ నాయకులు

అనుమతులు రద్దు చేయండి

• కలెక్టర్‌కు గ్రామస్థుల విజ్ఞప్తి

వరికుంటపాడు, భాస్కరాపురం రెవెన్యూ పరిధిలోని కొండ ప్రాంతంలో మంజూరు చేసిన మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ సోమవారం సర్పంచ్ దిలీప్‌కుమారు గ్రామస్థులతో కలిసి నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. తమ ప్రాంతంలో తవ్వకాలు జరిగితే జంగంరెడ్డిపల్లి వాసులతోపాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని విన్నవించారు. పంచాయతీ తీర్మానాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ప్రజాభిప్రాయ సేకరణకు ముందుగా ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా సబ్ కలెక్టర్ మాత్రం వ్యాపారులకు అనుకూలంగా మాట్లాడటం బాధాకరమన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు ఆంధ్రా పరంధామిరెడ్డి, షేక్ పీరయ్య, బాలచంద్ర, మనోహర్ తదితరులు ఉన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 636 బేళ్లను తీసుకొని రాగా, 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 323 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 313 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 159 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9448
వెండి కిలో ధర	రూ. 116500
వెండి ఒక గ్రాము	రూ. 119.50

ఆగిన సోమశిల అభివృద్ధి పనులు

● ముంచుకొస్తున్న వరద ● ఆందోళనలో అన్నదాతలు



అంపూర్తిగా ఉన్న రక్షణ గోడ పనులు

అనంతసాగరం జూలై 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి వరద రాక మొదలైంది. అయితే చేయాల్సిన అభివృద్ధి పనుల్లో కదలిక లేదు. ప్రాజెక్టు వద్ద అత్య వస రంగా చేయాల్సిన ప్రొటెక్షన్‌వాల్, ఆప్రాన్ పనులు గత కొంతకాలంగా నిర్మాణ దశలో ఆగిపోయాయి. దీంతో అన్న దాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మొత్తం 30 శాతం పనులుచేసిన గుత్తేదారుకు 20శాతం వరకు నిధులు మం జూరుచేశారు. ఇక పనులు ప్రారంభిస్తే మిగిలిన నిధులు ఇచ్చేందుకు అధికారులు రికార్డులు సిద్ధం చేశారు. అయినా పనులు చేసేందుకు కాంట్రాక్టరు మొగ్గు చూపకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికే శ్రీశైలం నిండి పోతిరెడ్డిపాడు నుంచి జిల్లాకు కృష్ణా జలాలు కొనసాగు తున్నాయి. పెన్నా ఉపనది కుందూ ప్రవాహం అధికంగా ఉంది. దీనికితోడు వర్షాలు కురిస్తే పరిస్థితి మారే ప్రమా దం ఉంది. భారీ వరద సోమశిలకు చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈలోపు అత్యవసర పనులు పూర్తిచేసేలా యంత్రాగం చర్యలు చేపడుతున్నా అవాంతరాలు తొలగడం లేదు. దీంతో పనులు పూర్తవుతాయా... లేదా అని రైతాంగం ఆందోళన చెందు తోంది. వర్షాకాలానికి ముందు పనులు పూర్తికాకపోతే చేసిన పనులు కూడా దెబ్బ తినే సూచనలు ఉన్నాయి.

పనులు చేయాలని కోరాం : ఎస్ఈ

సోమశిల ప్రాజెక్టు వద్ద అసంపూర్తిగా ఆగిన పనులు పూర్తిచేసేలా కృషి చేస్తున్నామని ఎస్ఈ బీ వెంకటరమణా రెడ్డి తెలిపారు. గుత్తేదారుకు బిల్లులు చెల్లించడం జరి గింది. మిగిలిన పనులు పూర్తిచేయాలని ఆదేశించాం. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు.

న్యూస్ బాక్స్

కిసాన్ డ్రోన్‌ల పంపిణీ



రైతులకు కిసాన్ డ్రోన్ అందచేస్తున్న అధికారులు

ఏఎస్ పేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం కిసాన్ డ్రోన్‌ల పంపిణీ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు నిర్వహించారు. ఈసంద ర్భంగా అనుమసముద్రం, పందిపాడు గ్రా మ రైతులకు డ్రోన్‌లను అందించారు. ఐదుగురు రైతులు కలిసి ఒక డ్రోన్ తీసుకోవచ్చని, డ్రోన్ విలువ రూ. 9.80 లక్షలు అయితే 80శాతం సబ్సిడీ రూ. 7.80లక్షలు పోను రూ. 2లక్షలు చెల్లించి డ్రోన్ పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ లభ్యం

ఉదయగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.అయ్యావారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మైనర్ బాలిక కొసిన పోగు ఇందును గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డి సోమవారం తెలిపారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందు అదృశ్యంపై తల్లిదండ్రులు ఎలీషమ్మ, జాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు, దర్యాప్తులో భాగంగా తమ సిబ్బంది నెల్లూరులో ఇందును గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. అనం తరం బాలిక నుంచి వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు అప్పజెప్పామని ఆయన తెలిపారు.

చిన్న తరహా నీటి వనరుల గణనకు సహకరించండి

సంగం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో చిన్న తరహా నీటివనరుల గణనకు రైతులు సహకరించాలని తహసీల్దారు సోమ్లా నాయక్ ఒక ప్రకటనలో కోరారు. ప్రతి గ్రామంలో ఉన్న వ్యవసాయ నీటి వనరుల సర్వేకు ఆయా గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రెవెన్యూ సహాయకులను నియమించడం జరిగిందన్నారు. వీరు ప్రతి గ్రామంలోని నీటి వనరులైన చెరు వులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు, బోరు బావులు, తవ్వకపు బావుల వివరాలు సేక రించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయడం జరుగుతుంది. అయితే గణనకు వచ్చిన వీఆర్వోలు, వీఆర్ఏలకు రైతులు సహకరించి నీటి వనరుల సమాచారం తె లియజేయాలని కోరారు. వచ్చే నెల 15వ తేదీ లోపు గణనను పూర్తి చేయాలని వీర్వోలను ఆదేశించారు.

దెబ్బతిన్న కుళాయి

● వృథా అవుతున్న మంచినీరు



కుళాయి నుంచి వృథాగా పోతున్న నీరు

సంగం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం ఎస్సీకాల నీలో పంచాయతీ వీధి కుళాయిల ట్యాప్‌లు దెబ్బతిని నీరు వృథాగా పో తున్నాయి. గ్రామంలో వాటర్ ట్యాంకు లేదు. బోరు పాయింట్ నుంచి నేరుగా కుళాయిలకు నీటిని సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సరఫరా ఉంటే కుళాయిలకు నీటి సరఫరా నిరంతరం కొనసాగుతుంది. ఈక్రమంలో ఎస్సీ కాలనీలో కుళాయి ట్యాపు దెబ్బతిని ఉండడంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి కుళాయిల ట్యాపులను ఏర్పాటుచేసి నీటి వృథాను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బిందెకు నీరు నింపేదెలా..!



భూమిలోకి కూరుకుపోయిన చేతిపంపు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 28 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ ఏసీ కాలనీలో చేతిపంపు భూమిలోకి కూరుకుపోయి ఉంది. దీంతో బిందె పెట్టి నీరు ఎలా పట్టుకోవాలంటూ కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి చేతిపంపు ఎత్తు పెంచాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పోలీసుల దమనకాండను నిరసిస్తూ

మున్సిపల్ కార్మికుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై పోలీసుల దమనకాండను నిరసిస్తూ సోమవారం సాయంత్రం ఆత్మకూరు పట్టణంలో సీఐటీయు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయు నాయకులు జి శివప్రసాద్, కొండమూరి హజరత్తయ్య, ఆత్మకూరు నాగయ్య మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని కొన్ని డివిజన్‌లలో పారిశుధ్య పనులను కాంట్రాక్టు కార్మికులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులపై వేదాయపాళెం సీఐ, పోలీసులు 30 మందిని అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులపై లాఠీచార్జ్ చేసిన సీఐ, పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, మున్సిపల్ యూనియన్ నాయకులు జి నాగేంద్ర, యు గురవయ్య, చినబాబు, యుతఈయు నాయకులుఏ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర స్మృతులే హరిహర వీరమల్లు సినిమా

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గత చరిత్ర స్మృతులే హరిహర వీరమల్లు సినిమా, కథా సారాంశమని, సినిమా హీరో, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అద్భుతంగా నటించారని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం వింజమూరులోని శిరీష థియేటర్లలో జనసేన నియోజవర్గ కోఆర్డినేటర్ కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆడపడుచుల కోసం ఉచిత షోను ప్రదర్శించారు. అనంతరం జనసేన ఆధ్వర్యంలో సినిమా థియేటర్లలో పనిచేసే వర్కర్లకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, జనసేన అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రసూల్, బీజేపీ మండల అధ్యక్షుడు డేగ మధుయాదవ్, తదితర నాయకులతోపాటు అభిమానులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

సీతారామపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు అన్నారు. సోమవారం బసినేనిపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేస్తూ ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథ కాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కన్వీనర్ మొత్తంశెట్టి చెన్నకేశవులు, అనంతశెట్టి ఏడుకొండలు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, తురక వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై విచారణ

అనంతసాగరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లి వద్ద ఆదివారం తెల్లవారుజామున నిద్రిస్తున్న ఆరేళ్ల బాలుడు నాగరాజుపై ట్రాక్టర్ దూసుకుపోవడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై సోమవారం అధికారులు విచారణ జరిపారు. తహసీల్దారు జయవర్ధన్, సోమశిల పోలీసుల ఆధ్వర్యంలో బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం, శవపంచనామ నిర్వహించారు.

వైద్యశాలలో తీరిన తాగునీటి కష్టాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వైద్యశాలలో కొత్త మోటార్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఉదయగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థా నిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మరమ్మతులకు గురైన మోటార్ స్థానంలో సోమవారం నూతన మోటార్ ఏ ర్పాటు చేసి రోగులు, సిబ్బంది తాగునీటి క ష్టాలు తీర్చారు. ఈ నెల 23న ఆంధ్రజ్యోతిలో 'వైద్యశాలలో తాగునీటి కష్టాలు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన వైద్యశాల డీడీవో ప్రశాంత్ సమ స్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన టీడీపీ నాయకుడు తుమ్మల కిరణ్‌ను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీం తో ఆయన రూ.30 వేలు వెచ్చించి నూతన మోటార్‌ను కొనుగోలుచేసి ఏర్పా టుచేసి వైద్యశాలలో తాగునీటి సమస్య తీర్చారు. దీంతో రోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఉదయగిరి కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు చేయూతనివ్వాలి



ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సాధన సమితి అధ్యక్షుడు వేణుగోపాల్

ఉదయగిరి, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాల పునర్విభజనలో భాగంగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినందున ఉదయగిరి కేంద్రం గా జిల్లా ఏర్పాటుకు చేయూత నివ్వాలని కావలి ఎమ్మెల్యే దగు మాటి వెంకటకృష్ణారెడ్డిని జిల్లా సాధన సమితి కోరింది. సోమ వారం కావలిలోని ఆయన క్యాం పు కార్యాలయంలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఉద్యమ నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశా బ్దాలుగా అభివృద్ధికి నోచుకోని మెట్ట ప్రాంత మైన ఉదయగిరి అన్నిరంగాల్లో అభివృద్ధి చెం దాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గ మన్నారు. కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి ఉద్యమ నాయకులు నాని, మురళి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాధిపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ బాలాజీ

ఆత్మకూరు, జూలై 28: స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్య శాలలో సోమవారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సం దర్భంగా నోడల్ అధికారి డాక్టర్ బాలాజీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈసందర్భంగా పల్మానాలజిస్ట్ డాక్టర్ బాలా జీ, మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ సలేహా మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధిపై ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాపాయం తప్పదన్నారు. హెపటైటిస్ వ్యాధి ఏ,బి,సి,డి,ఇ రకాల వైరస్‌ల వలన సంక్రమిస్తుందన్నారు. బి, సి రకాల వైరస్‌లు దీర్ఘకాలిక కాలేయ వ్యాధి, కాలేయ క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని తెలి పారు. ఇవి కలుషిత సిరంజిలు, సూదులు, రక్త ం, లైంగిక సంపర్కం ద్వారా వస్తాయన్నారు. ఏ, ఇ రకాల వైరస్‌లు కలుషిత నీరు, ఆహారం ద్వారా సోకుతాయన్నారు. ఈ వ్యాధి లక్షణాలు కామెర్లు, జ్వరం వస్తాయన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారు లివర్ పరీక్షలు చేయించుకుని తగిన మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృతిక,ల్యాబ్ టెక్నీషి యన్లు నాగార్జున సుభాని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో గిరిజనులతో సీపీఎం నాయకులు

అనంతసాగరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తమ గిరిజన కాలనీలో సమస్యలు పరి ష్కరించాలని కోరుతూ అనం తసాగరం మండలం పడ మటి కంబంపాడుకు చెందిన గిరిజనులు సోమవారం చ లో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో చాలామందికి పక్కా గృహా లు లేవని, విద్యుత్ సౌకర్యం లేక అంధ కారంలో ఉన్నామని, నీటివసతి కల్పించాలని కోరుతూ జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. దీనికి సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు.

అత్యవసరమైతే ఆరుబయటకే...

● ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేక ఉద్యోగులు, ప్రజల అవస్థలు



మరుగుదొడ్డి లేని ఉదయగిరి తహసీల్దారు కార్యాలయం

ఉదయగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను బహి రంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చి దిద్దేందుకు ప్రచారం చేస్తున్న మండలస్థాయి అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగు దొడ్ల నిర్వహణపై దృష్టిపెట్టడం లేదు. దీంతో ఉద్యోగులు, వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. పలు చోట్ల మరుగుదొడ్లు ఉన్నా నిర్వహణ లేక వినియోగదానికి దూరంగా ఉన్నాయి. దీంతో ఉద్యోగులు సైతం ఆరుబయటకు వెళ్ళాల్సిన దుస్థితి నెలకొంది.

అధికారులకు మాత్రమే

మండలాల్లో తహసీల్దారు, మండల పరి షత్, వ్యవసాయ, వెలుగు, ఉపాధి, విద్య, గృహనిర్మాణ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సబ్ రిజిస్ట్రార్, ట్రెజరీ తదితర శాఖల కార్యాలయాలు కీలకమైనవి. వీటికి నిత్యం ఏదో ఒక పని నిమిత్తం ప్రజలు వస్తుంటారు. కొన్ని కార్యాలయాల్లో మరుగు దొడ్లు ఉన్నా అధికారులే వినియోగిస్తున్నారు. ఇక సిబ్బంది, ప్రజలు మాత్రం ఇబ్బందులు పడాల్సిందే. ఉదయగిరి తహసీల్దారు కార్యా లయ ఆవరణలో తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్, ట్రెజరీ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడికి నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. అలాగే వెలుగు, ఐసీడీఎస్ కార్యాలయాలలో నిత్యం మహిళలతో సమావే శాలు నిర్వహిస్తారు. అత్యవసర సమయాల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీఇన్నీ కావు. దుత్తలూరులో తహసీల్దారు, మండల పరిషత్, వ్యవసాయ, గృహ నిర్మాణ, వెలుగు, హౌసింగ్ కార్యాలయాలు అన్నీ ఒక చోటే ఉన్నా బహిరంగ మరుగుదొడ్లు లేవు. కొన్ని కార్యాలయాల్లో ఉన్నా అవి అధికారులే వినియోగించుకుంటున్నారు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మరుగుదొడ్లు నిర్మించి సిబ్బంది, ప్రజల అవస్థలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

బస్సు ఢీకొని యువకుడి మృతి

● సోదరికి మందులు తీసుకెళ్తూ తిరిగిరాని లోకాలకు..



రవి మృతదేహం

కావలి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అనా రోగ్యానికి గురైన తన సోద రికి మందులు తీసుకు వెళు తున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై తిరిగి రాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన కావలి మండలం చెంచుగానిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు... ముసు నూరు అరుంధతీయవాడకు చెందిన పోతిపోక రవి(38) బీటెక్ పూర్తి చేసినా సెంట్రింగ్ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గౌరవరంలో ఉంటున్న తన అక్క బుజ్జమ్మకు వాంతులు, విరోచనాలు అవుతు ండడంతో మందులు, కొబ్బరినీరు తెమ్మని రవికి సమాచారం ఇచ్చింది. దీంతో మందులు తీసుకుని మోటారు బైక్‌పై గౌరవరం బయలుదేరాడు. మార్గమధ్యంలోని చెంచుగానిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలో విజయవాడ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్ బస్సు వేగంగా మోటారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారు బైక్‌తో సహా రవి బస్సు కింద ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే మొబైల్ సిబ్బంది సమాచారంతో ఎస్ఐ తిరు మలరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బస్సు డ్రైవర్‌ను అదు పులోకి తీసుకుని రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలి పారు. కాగా రవి మృతితో ముసునూరు అరుంధతీయవాడలో విషాదం అలుముకుంది.

హిజ్రాల వర్గపోరు

● పోలీసులకు ఫిర్యాదు ● కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 28(ఆంధ్రజ్యోతి): 'మా గ్రూపులో ఉంటూ ఆ గ్రూపులోకి ఎలా వెళతావు' అంటూ ఓ హిజ్రాపై తోటి హిజ్రాలు దాడిచేశారు. బాధిత హిజ్రా ఫిర్యాదు మేరకు నగరంలోని నవాబు పేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు... కోవూరు వడ్డిపాలెంకు చెందిన హిజ్రా శిరీషను మాట్లాడాలని శిల్పా, అలేఖ్య పిలిచారు. దీంతో ఆమె ఆదివారం జనార్ధన్‌రెడ్డి కాలనీకి వెళ్లింది. తనతో వారు మాట్లాడు తూనే శిల్పా, అలేఖ్య, రితిక, రీనులు దాడి చేశారని శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే శిరీషపై దాడి జరిగిందని తెలుసుకున్న శీలా వర్గానికి చెందిన హిజ్రాలు, శిల్పా, అలేఖ్య వర్గానికి చెందిన హిజ్రాలు ఆదివారం అర్ధరాత్రి నవాబుపేట పోలీసుస్టేషన్ వద్దకు చేరు కున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు వెంటనే స్టేషన్ వద్దకు చేరుకొని, పరిస్థితిని చక్కదిద్ది అందరినీ అక్కడ నుంచి పంపించివేశారు. కాగా శిరీష తమ వర్గంలో ఉండగా, అవతలి వర్గంలోకి వెళ్లిందని, ఈ క్రమంలో శిల్పా, అలేఖ్య, రితిక, రీనూలు తమ వర్గంలోకి రావాలని ఆమెపై ఒత్తిడి చేశారు.

భర్త మృతిపై అనుమానాలున్నాయ్!

నెల్లూరు(క్రైం), జూలై 28(ఆంధ్రజ్యోతి): తన భర్త మృతిపై అనుమానాలున్నాయని ఆదివారం ఆత్మహత్య చేసుకున్న తరుణ్ తేజ భార్య ప్రవళ్లిక పేర్కొన్నారు. తరుణ్‌తేజ మృతదేహానికి జీజీహెచ్ మార్చురీలో వైద్యులు సోమవారం పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. మార్చురీ వద్ద ప్రవళ్లిక మీడియాతో మాట్లాడుతూ తరుణ్‌తేజ ఆత్మహత్య చేసుకునేం త పిరికివాడుకాదని, ఆయన స్నేహితురాలే హత్యచేసి ఆత్మ హత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని ఆమె ఆరోపించారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

అనంతసాగరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో బద్వేల్ రోడ్డుపై సోమవారం సాయంత్రం ఆటో బోల్తాపడ్డ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. అనంతసాగరం నుంచి వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తూ గాయపడిన ఆర్ పవన్‌కల్యాణ్, రఘురామ్‌ను 108 వాహనంలో సాగరం ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

మద్యం స్వాధీనం

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తిరిగి నీటిని సరఫరా చేసే వైసీపీ నాయకుడికి చెందిన ఆటోలో ఇతర రాష్ట్రానికి చెందిన మద్యం పట్టుబడిన సంఘటన దుత్త లూరులో సోమవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివ రాల మేరకు... దుత్తలూరు పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో దుత్తలూరుకు చెందిన కంభం ప్రభాకర్‌రెడ్డి గత కొన్నేళ్లుగా శుద్ధిజల కేంద్రం నడుపుతున్నాడు. ఈక్రమంలో సోమవారం నీటిని సరఫరా చేసే ఆటో నడుపుతున్న డ్రైవర్ మనోజ్‌తో కట్టకిందపల్లె కాలనీకి చెందిన కొందరితో వివాదం జరుగుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆటోను తనిఖీ చేయగా వాటర్‌ట్యాంక్ కింద కర్ణాటక రాష్ట్రానికి చెందిన 11 మద్యం టెట్రా ప్యాకెట్లు దొరికాయి. దీంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

కొడవలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొడవలూరులోని ఎన్టీఆర్ కాలనీలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. రూ. లక్షా 20 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. 6 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ కోటిరెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో 14 గొర్రెల మృతి

రూ. 2 లక్షల ఆస్తి నష్టం



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

బుచ్చిరెడ్డిపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో 12 గొర్రెలు, 2 పొట్టేళ్లు మృత్యువాతపడిన సంఘటన మండలంలోని కొత్త మినగల్లు గ్రామం దళితవాడలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు నెత్తుటి మడుగులో పడి ఉన్న మూగ జీవాలను గుర్తించి వెంటనే యజమానికి చెప్పారు. కొత్త మినగల్లు దళితవాడలో నిరుపేద కుటుంబానికి చెందిన గడ్డె లచ్చయ్యకు గొర్రెలే జీవనాధారం. తన మొత్తం 20 గొర్రెలలో కుక్కల దాడిలో 14 మృతి చెందాయి. ఇక 4 గొర్రెలే మిగిలడంతో యజమాని లచ్చయ్య గుండెలు బాదుకున్నాడు. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఆదివారం రాత్రి తన గొర్రెలను దొడ్డిలో తోలిన లచ్చయ్య నిద్రలేచే సరికి కుక్కలదాడిలో 14 గొర్రెలు మృతి చెందడంపై తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. సమాచారంతో పశువైద్యులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతి చెందిన గొర్రెల యజమానిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 475

పరిశ్రమల ఏర్పాటుకు భూముల పరిశీలన

కలిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరు పంచాయతీ పరిధిలో సోమవారం పరిశ్రమల ఏర్పాటుకు భూములను ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ శివప్రసాద్, తహసీల్దారు గిరీష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ మండలంలో పెదకొండూరు ప్రాంతంలో సుమారు 400 ఎకరాలు ప్రభుత్వ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి భూముల పరిశీలించామ న్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లీలాసుధి, సర్వేయరు ఎస్‌కే సోని, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

నేడు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాక

కావలి, జూలై 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం కావలి నియోజకవర్గంలోని కావలి, బోగోలు మండలాల్లో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలతో కలిసి మంత్రి కావలి మండలంలోని తుమ్మలపెంట, ఒట్టూరు గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాలలో పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనన, ప్రారంబోత్సవాలు చేస్తారని పేర్కొన్నారు. అనంతరం బోగోలు మండలంలోని జువ్వలదిన్నెలో జలజీవన్‌మిషన్ పనులను ప్రారంభిబించి అనంతరం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి అక్కడ మత్స్యకారులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఎఫ్‌ఏ-1 పరీక్షలకు సిద్ధం చేయండి

● డిప్యూటీ ఈవో నరసింహారావు

కొండాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని కందుకూరు డిప్యూటీ ఈవో పీపీ.నరసింహారావు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాలను ఆనయ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పరిశీలించి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ గురించి ప్రధానోపాధ్యాయుడు వీవీ.రమణను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు గణితంలో పాఠ్యాంశాన్ని ఆయన బోధించారు.

నిర్బంధాలతో ప్రజా పోరాటాలు ఆపలేరు

కావలి(టౌన్), జూలై 28(ఆంధ్రజ్యోతి) : నిర్బంధాలతో ప్రజా పోరాటాలు ఆపలేరని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెంచలయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఉలవపాడు మండలం కరేడు వద్ద విలువైన పంట భూములను ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం రైతులను నిర్బంధాలపాలు చేయడం, అక్రమ కేసులు పెట్టడం, భయాందోళలకు గురిచేసి బలవంతంగా భూములు లాక్కోవాలనుకోవడం దుర్మార్గమన్నారు. కరేడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి భూములు బలవంతంగా లాక్కుంటే వారి జీవనాధారం లాక్కున్నట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ముగ్గురు గిరిజన మహిళలపై కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించడం భూపోరాటాలకు అండగా నిలబడ్డ జీవీబీ కుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులోనే పాలన ఇంత దారుణంగా ఉంటే మిగిలిన అడుగుల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారబోతుందని, ప్రజలు ప్రభుత్వ కుట్రలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

228 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 475 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10కంపెనీ ప్రతినిధులు పాల్గొని 247 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-210, ఆర్‌ఆర్-3, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 228 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.209.63గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

బిట్రగుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కృషి చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. బోగోలులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం నుంచి పెద్దస్థాయిలో నిధులు మంజూరు చేయించారన్నారు. మంగళవారం మంత్రి కొల్లు రవీంద్ర చేత జువ్వలదిన్నెలో రూ.1.45 కోట్లతో జల జీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన చేయిస్తున్నారన్నారు. ఫిషింగ్ హార్బర్ పరిశీలన, గంగపుత్రులతో సమావేశ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

విద్యార్థులకు సమదుస్తుల పంపిణీ

కొండాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిమూర్తిపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం యూనిఫాం పంపిణీ చేశారు. అయితే ఆ దుస్తులు కుట్టించేందుకు పాఠశాల విద్యాకమటీ చైర్మన్ చిమ్మిలి శ్రీనివాసులు రూ.12 వేల వితరణ చేశారు. తమ పిల్లలకు సహకారం అందించడంపై తల్లిదండ్రులు చైర్మన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుర్రం మాల్యాద్రి, అంగన్‌వాడీ కార్యకర్త తుమ్మల మహేశ్వరి, రావూరి రత్నం, గ్రామస్థులు పాల్గొన్నారు.

రీసర్వేలో సమస్యలు తీర్చరా?



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

- అవసరంలేకున్నా హక్కుపత్రాలు చూపాలని మెలిక
- రైతుల సమస్యలు పట్టించుకోని అధికారులు
- నేతలు చెబితేనే అరకొరగా పరిష్కారం
- సర్వే నెంబర్లు మారిపోయి రిజిస్ట్రేషన్‌కు తంటాలు

‘రీసర్వేలో అధికారులు భూసమస్యలు పరిష్కరించరా...? సమస్యలు సృష్టించిందివారే... కానీ తప్పు చేసినట్టుగా మమ్మల్ని కారకులుగా చూస్తున్నారు... అవసరం లేకున్నా భూహక్కు ప్రతాలను చూపాలని మెలిక పెడుతున్నారు... మేము అడగకపోయినా వచ్చి రీసర్వే చేశారు. భూరికార్డుల పొరపాట్లను సరిదిద్దకుండా రీసర్వే ఎందుకు’... అని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేను అధికారులు సమగ్రంగా చేయక పోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమయ్యా యి. ఈ సమస్యలకు నేటి రాష్ట్ర ప్రభుత్వంలోనైనా పరిష్కారం దొరుకుతుందని భావించిన రైతాంగానికి నిరాశే ఎదురవుతోంది.

అల్లూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో ఒకరి భూమి మరొకరి పేరుతో వెబ్‌ల్యాండ్‌లో ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నెంబరుతో నమోదైన సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. వీటిని పరిష్కరించుకోవాలంటే రెవెన్యూ కార్యాలయాల్లోని తహసీల్దారు, ఆర్‌ఐ, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ జరిపి, ఎవరి భూమిని వారి పేరుతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. కానీ ఇందుకు రెవెన్యూ అధికారులు పెడుతున్న మెలికలతో రైతులు లబోదిబోమంటున్నారు.

పాత రికార్డులు కావాలంటూ...

రీసర్వే ప్రారంభంలో దాదాపు 70 శాతం రైతుల వద్ద తమ భూములకు చెందిన రికార్డులు సరిగా లేవు. దీంతో రీసర్వే చేపట్టి వారికి శాశ్వత హక్కును కల్పించే దిశగా గత ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపట్టింది. రీసర్వే సమయంలో రికార్డులు అవసరం లేకుండానే అనుభవదారుడిని పట్టాదారుడిగా నమోదు చేస్తూ ఎల్‌పీఎం నెంబరును కేటాయించి వెబ్‌ల్యాండ్‌లో 1-బీ, అడంగళ్లను మంజూరు చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ ప్రక్రియ చేపట్టే సమయంలో భూరికార్డులు లేకపోయినా కేవలం అగ్రిమెంట్లు ఆధారంగా పూర్తి చేసిన అధికారులు సమస్యలను సృష్టించి వెళ్లిపోయారు. జరిగిన పొరపాట్లను గ్రామసభలు పెట్టి పరిష్కరిస్తామని చెప్పిన నాటి అధికారులు వాటిని తూతూమంత్రంగా నిర్వహించారు. నేడు ఆ సమస్యలను పరిష్కరించమని రైతులు అధికారులను సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకుని రమ్మంటూ మెలిక పెడుతున్నారు. రీసర్వే చేసేటప్పుడు అవసరం లేని రికార్డులు ఇప్పుడు ఎందుకు అవసరమైందంటూ రైతులు విమర్శిస్తున్నారు.

నేతలు చెప్తేనే..

రీసర్వేలో ఏర్పడిన సమస్యలను నాయకుల దృష్టికి, లేదా ఆ ప్రాంత ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్తేనే అరకొర సమస్యలు మాత్రమే పరిష్కారమవుతున్నాయి. కొంతకాలంగా మండలంలో ఈ సమస్యలు ఉన్నా, స్థానిక నాయకుల చొరవతో కొన్ని సమస్యలు తీరాయి. మరికొన్ని సమస్యలు అలానే ఉండిపోయాయి. రైతులు చేసేది లేక ఇటీవల అల్లూరులో సమావేశం నిర్వహించిన కావలి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా ఈ సమస్యలను వెంటనే పరిష్కరించమని ఆయన అధికారులను ఆదేశించారు.

రీసర్వేపై స్పష్టత లేదు



ఇనాం గ్రామాలను రీసర్వే చేయకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఇనాం గ్రామాల్లో రికార్డులు సరిలేక భూములు రిజిస్ట్రేషన్లకు నోచుకోవడంలేదు. ఆర్‌ఎస్‌ఆర్ (డైగ్లాట్) లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. రీసర్వే చేస్తే శాశ్వత రికార్డు ఏర్పడుతుందని భావిస్తున్నాం.

- పొలిశెట్టి శ్రీనివాసులు, ఉలవపాళ్ల, దగదర్తి మండలం

రైతులను ఆదుకోవాలి



రీసర్వేలో తలెత్తిన సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకరి భూ రికార్డులు మరొకరి పేరుతో నమోదవడంతో సమస్యలు జఠిలంగా మారుతున్నాయి. సమస్యలు ఏర్పడకుండా ఉండాలంటే వాటిని వెంటనే సరిదిద్ది పరిష్కరించాలి.

-ఆట తిరుమల, సర్పంచి, పడమర గోగులపలి

రీసర్వే చేపట్టాలి



జిల్లాలో అనేక గ్రామాల్లో రీసర్వే చేపట్టలేదు. రీసర్వే చేపడతామని అధికారులు పేర్కొన్నారు. కానీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఒక్క మూడు ప్రధాన గ్రామాలకు ఎప్పుడు రీసర్వే చేపడతారో తెలియడం లేదు.

-యరటపల్లి శేఖర్‌రెడ్డి,రైతు, అల్లూరు

దళితుల భూ సమస్యలు పరిష్కరించాలి

● తహసీల్దారుకు వినతి



తహసీల్దారుకు అర్జీ అందజేస్తున్న దళిత నేత మల్లి

బిట్రగుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): దళితుల భూములను పెత్తనపు దారులు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో బోగోలు మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డికి దళిత మహిళ కేశవరపు కుమారమ్మకు సంబంధించిన భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ అందచేశారు. నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డి పాలెంలోని సర్వే నంబరు 333లో గల కుమారమ్మకు సంబంధించిన భూమిని సుబ్బరామిరెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకు న్నాడని తెలిపారు. కుమారమ్మ ఎవరికి అమ్మలేదని ఉపాధికోసం చెన్నై వెళ్లిందన్నారు. ఈ క్రమంలో ఆమె భూమిని ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ఆ భూస్వామిపై చట్టపర మైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. అలాగే మండలంలో అనేకచోట్ల దళిత, గిరిజనులకు సంబంధించిన భూములతో పాటు ప్రభుత్వ భూములు ఆక్రమణ లకు గురయ్యాయని, వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు జెడ్డా వాసు, ఆత్మకూరు తేజ తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే

‘సుపరిపాలనలో తొలిఅడుగు’

● ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి

అల్లూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిన సందర్భంగా క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. మండలంలోని ఇందుపూరు, పురిణి గ్రామాల్లో సోమవారం ఆయన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలసి పర్యటించారు. పలు ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, ఇందుపూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశానుసారం కిందిస్థాయి నాయకుల నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు ప్రతి నాయకుడు, ప్రతి ప్రజాప్రతినిధి క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఇందుపూరు గ్రామ సచివాలయ నిర్మాణానికి సహకరించి స్థలాన్ని దానం చేసిన వసంత్ కుమార్‌ను అభినందించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. పేదల అభ్యున్నతికి పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గ్రామాల్లో ఉండే ప్రతి సమస్యను పరిష్కరించేందుకే తామంతా ప్రజలతో మమేకమవుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను స్థానిక నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వారి తెలుసుకొని సంబంధిత యాప్‌లలో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, నాయకులు పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఎందేటి హరికృష్ణ, అంబటి రాజేంద్ర, పాపనబోయిన రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



ఎమ్మెల్యే నాగేశ్వరరావును సన్మానిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు


వలేటివారిపాలెం, జూలై 28(ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కృషి చేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి గుత్తా మధుబాబు రూ.3.50 లక్షలతో నిర్మించిన సభావేదికను ఎమ్మెల్యే నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. అనంతరం హైస్కూల్ హెచ్‌ఎం కమల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో పెను మార్పులకు మంత్రి లోకేషబాబు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మధుబాబును ఆదర్శంగా తీసుకొని సేవాభావంతో పాఠశాలల అభివృద్ధికి దోహదపడాలని చెప్పారు. సభావేదిక నిర్మాణానికి పాటుపడిన మధుబాబుతో పాటు ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులు, నాయకులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నరసింహారావు, దాత గుత్తా నరసింహం, న్యాయవాది వలేటి శ్రీధర్‌నాయుడు, ఎంఈవో మల్లికార్జునరావు, ఎంపీడీవో నరేంద్రదేవ్, ఆర్‌ఐ ప్రసాద్, వైద్యాధికారి శివసిద్ధప్ప, ఎస్‌ఐ మరిదినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెంలోని ఎస్సీ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. నాయకులు వలేటి శ్రీధర్‌నాయుడు, వలేటి నరసింహం, కాకుమాను ఆంజనేయులు, గుత్తా మహేశ్వరరావు, కాకుమాను మాల్యాద్రి. వలేటి మధుసూదన్‌రావు, కొంకా రమేష్, సాధు శ్రీలత, వీరమోను అంజయ్య, గుత్తా కొండయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



మహిళలకు కరపత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కొండాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించేందుకు కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం రూపొందించిందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని కొమ్మి పంచాయతీ రామానుజపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం పనితీరును అడిగి తెలుసుకొని ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్న ఆయన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబునాయుడు, బొట్లగుంట హరిబాబు, దామా మహేశ్వరావు, పోలినేని రమేష్, దాసరి అశోక్, అంబటి రాంబాబు, ఆకుల వెంకటేశ్వర్లు, కుంకు మోహనరావు, గద్దె రాఘయ్య, తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ నేతలకు పరామర్శ

రామానుజపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఆకుల చిన మాలకొండయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న కాకర్ల ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే గ్రామంలో ఇటీవల మరణించిన టీడీపీ నాయకుడు ఉన్నం హజరత్తయ్య ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కందుకూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించిన 10వ ఓపెన్ తైక్వాండో జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శనతో పతకాలు సాధించారని తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కోచ్ అబ్దుల్‌సలాం తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో ఏపీ చాంపియన్‌షిప్ సాధించటంలో జిల్లా క్రీడాకారులు ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ పథకాలు పొదుపు మహిళలకు చేరాలి

కావలి రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను స్వయం సహాయక సంఘాల మహిళలకు చేరువ చెయ్యాలని వెలుగు ఏపీఎం పీవీ. కృష్ణారావు పేర్కొన్నారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు థెరిసా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో ప్రకారం అన్ని శాఖల్లో ఉన్న స్కీములు, సంక్షేమ పథకాలను స్వయం సహాయక సంఘాల మహిళలకు చేరువ చేసి ఎక్కువ మంది లబ్ధిపొందేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార సుద్ధి పరిశ్రమల పథకం ద్వారా 5 యూనిట్లును మండల సమాఖ్య ద్వారా సమీకరించడం జరిగిదన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ డీ.రాజు, సీసీలు ఎస్‌కె రసూల్, టీవీ. ప్రసాద్ బాబు, శివయ్య, చిరంజీవి, మాల్యాద్రి, అకౌంటెంట్ నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఆత్మీయ సన్మానం



ఉపాధ్యాయుడును సన్మానిస్తున్న టీచర్లు

ఉలవపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోట వైసంఘంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై అలగాయపాలెం జడ్పీహెచ్ పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయుడు బీ.కోటేశ్వరరావును సోమవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ-2 పీవీ రమణయ్య, కరేడు క్లస్టరు హెడ్‌మాస్టర్ పీ.శ్రీనివాసులు, ఎస్‌ఎంసీ వైస్‌చైర్మన్ శిరీష, మాజీ చెర్మన్ మహేష్, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దారు కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



పాత, కొత్త తహసీల్దార్లను సన్మానించిన ఉద్యోగులు

లింగసముద్రం, జూలై 28(ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దారుగా నియమితులైన ఎం. కోటేశ్వరరావు ఎట్టకేలకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు బదిలీ అయిన తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి బాధ్యతలు అప్పగించి అభినందనలు తెలిపారు. కొండాపురం తహసీల్దారు కోటేశ్వరరావును లింగసముద్రంకు, ఇక్కడి తహసీల్దారు సీతామహాలక్ష్మిని కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా గత నెల 9వ తేదీన జిల్లా కలెక్టర్ బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరిస్తానన్నారు. కాగా పలువురు టీడీపీ నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లింగసముద్రం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన కోటేశ్వరరావు, ఇక్కడ పనిచేస్తూ బదిలీ అయిన తహసీల్దారు సీతామహాలక్ష్మిని కార్యాలయంలో అధికారులు, వీఆర్‌వోలు, సర్వేయర్లు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు సహించం

● జలదంకి మండల టీడీపీ నేతలు



మాట్లాడుతున్న జలదంకి మండల టీడీపీ నేతలు

కావలి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని, అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని జలదంకి మండల టీడీపీ నేతలు హెచ్చరించారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో జలదంకి మండల టీడీపీ కన్వీనర్ పులుగుంట మధుసూదనరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు పూనూరు భాస్కర రెడ్డి, సీనియర్‌నేత కరియావుల అప్పలనాయుడు మాట్లాడారు. జలదంకి మండలం గట్టుపల్లి రెవెన్యూ పరిధిలోని 98 ఎకరాల మామిడితోటను ఉత్తరాదికి చెందిన సదాశివరావు, తలశిల నరసింహారావు కొన్నారన్నారు. దానిలో 88 ఎకరాలు సదాశివరావు పేరు మీద, మిగిలినది తలశిల నరసింహారావు పేరుమీద ఉన్నట్లు తెలిపారు. అయితే దానిలో 30 ఎకరాలు తలశిల నరసింహారావు పేరుమీద అగ్రిమెంట్ రాసి ఉందని ఈవిషయంపై వారిద్దరి మధ్య భూవివాదాలు ఉన్నాయని చెప్పారు. ఆ తోటలో మామిడి పంటను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోయించాడని సదాశివరావు నిందారోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఎన్‌ఆర్‌ఐగా ఉంటూ ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చిన కాకర్ల సురేష్ సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాల చేపడుతున్నరని, అలాంటి ఆయనకు మామిడికాయలు కోయించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. మామడితోటలో వివాదం ఉంటే ఇరువురు తేల్చుకోవాలి కానీ ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సదాశివరావు వెనుక వైసీపీ నేతలు ఉండి మాట్లాడిస్తున్నారని వారికి కూడా తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



భళారే.. కుంకుడాకుపై సినారె!

'కరగనిదే కొవ్వొత్తికి కాంతి ఎలా వుడుతుంది?' అని ప్రపంచ పదుల్లో సినారె ప్రశ్నించినట్లుగానే.. చిత్రకారుడి కుంచె కూడా కొన్ని చిత్రాలను గీస్తున్నప్పుడు తీవ్రమైన సంఘర్షణకు లోనవుతుంది. కానీ.. 'సినారె' చిత్రాన్ని గీసేటప్పుడు మాత్రం.. ఆయన చేతిలోని 'కుంచె' కూడా.. అచ్చం... 'చరణ కింకిణులు ఘల్లు ఘల్లు' మనేలా నవ్య భావోద్వేగానికి గురై ఉంటుం దేమో. ఆనంద తాండవం ఆడి ఉంటుందేమో! నిజమే... 'కాదేదీ కవితకు అనర్హం..' అన్నట్లు మంచి చిత్రం గీయాలన్న ఆసక్తి.. ప్రతిభ ఉండాలే కానీ.. ఏ వస్తువుపైన గీసినా సరే.. చిత్రకారుడి కుంచె ఇట్టే ఒదిగిపోతుంది. అందుకు నిదర్శనమే.. కుంకుడాకుపై విశ్రాంత చిత్రకళోపాధ్యా యుడు పచ్చా పెంచలయ్య గీసిన 'సినారె' చిత్రం. ప్రముఖ సినీ గేయ రచ యిత, జ్ఞానపీఠ అవార్డుగ్రహీత డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) జయంతిని పురస్కరించుకుని ఇలా తన కుంచెతో 'చిత్ర' నివాళులర్పించారాయన. పొదలకూరు మండలపరిధిలోని మహమ్మదాపురం గ్రామానికి చెందిన ఈ డ్రాయింగ్ మాస్టారుకు సినారె కలం నుంచి జాలువారిన సినిమా పాటలన్నా.. కవిత్వమన్నా చాలా ఇష్టం. అందుకే ఆయన చిత్రాన్ని విభిన్నంగా కుంకుడు ఆకుపై కళాత్మకంగా చిత్రించడం విశేషం. ఈ సూక్ష్మ కళా చిత్రాన్ని చూసిన వారు.. 'భళారే.. కుంకుడాకుపై సినారె!' అంటూ పెంచలయ్య చిత్ర కళా ప్రతిభను అభినందించారు.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

చెన్నై మెమూను నాయుడుపేట వరకు పొడిగించండి

● ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే ఈఎంయూ రైలు సేవలను నాయుడుపేట వరకు పొడిగించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీరన్న సోమన్నకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు.

● సామర్థ్యాల పెంపునకు తీసుకుంటున్న చర్యలేంటి

విద్యార్థుల్లో ఉపాధి సామర్థ్యాలను పెంచేందుకు తీసుకుంటున్న చర్య లను వివరించాలని సోమవారం లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి సమాధానమిస్తూ విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని మెరుగు పరచడానికి అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ, డిప్లమో కార్యక్రమాలను కేంద్రం ప్రకటించిందన్నారు.



జాతీయ రహదారిపై ప్రారంభమైన బసినేనిపల్లి టోల్‌ప్లాజా

బసినేనిపల్లి టోల్‌ప్లాజా ప్రారంభం

సీతారామపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 167 బిజి బసినేనిపల్లి టోల్‌ప్లాజా సోమవారం పారంభమైంది. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా నిర్వాహకులు వాహనదారులకు స్వీట్లు పంచి పెట్టి స్వాగతం పలికారు. సీతారామపురం నుంచి దుత్తలూరు మీదుగా ఏర్పాటుచేసిన ఈ జాతీయ రహదారికి బసినేనిపల్లి టోల్ వసూళ్లకు కేంద్రం కానుంది.

ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

విడవలూరు, (ఆంధ్రజ్యోతి): విడవలూరు బిట్ 1 ఎంపీటీసీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీవో నగేష్ కుమారి తెలి పారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 1 వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్ల స్వీకరిస్తామన్నారు. 2న సాయంత్రం వరకు నామినేషన్ల పరిశీలన, తిరస్కరించిన నామి నేషన్లపై అప్పీళ్లు, 4న తిరస్కరించిన వాటిని పరిష్కరిస్తామన్నారు. 5న నామినేషన్ల ఉప సంహరణ, పోటీదారుల తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. 12న ఉదయం 7 నుంచి సాయం త్రం 5 వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. 13న అవసరమైతే రీపోలింగ్ జరుగుతుందన్నారు. 14న ఉద యం 8 నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిపి, అదే రోజున ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తా మన్నారు. పంచాయతీ డీఈ మోహన్ రావు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగాను, తహసీ ల్దారు, ఎంపీడీవో అదనపు రిటర్నింగ్ అధికారులుగాను వ్యవహరిస్తారన్నారు.

పీ-4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అన్నీ శాఖల అధికారులు తమవంతు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో పీ-4లో భాగంగా బంగారు కుటుంబాలు, మార్గదర్శిల ఎంపికపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జిల్లాస్థాయి అధికారులంతా తమ శాఖల పరిధిలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 10వేలకుపైగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శిలు ముందుకువచ్చారన్నారు. అన్నీ శాఖల అధికారులు బంగారు కుటుంబాలను ఎంపిక చేసి మార్గదర్శిలు దత్తత తీసుకునేలా కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో నరసింహారావు, జడ్పీ సీఈవో మోహన్‌రాజు, హౌసింగ్ పీడీ వేణుగోపాలత్, డ్వామా పీడీ గంగాభవానీ, తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలకు అందుబాటులో ఉండాలి

వివిధ శాఖల మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్ శంకరన్‌హాల్ నుంచి వివిధ అంశాలపై అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం, అన్నదాన సుఖీభవ తదితర పథకాలను అర్హులకు అందజేయడానికి వీలుగా, జాయింట్ ఎల్పీఎంలను త్వరగా సబ్ డివిజన్ చేయాలని ఆదేశించారు. అవసరమైనచోట ఆధార్ డీ లింకింగ్‌ను కూడా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలను క్వాలిటీతో పూర్తి చేస్తేనే బిల్లులు చెల్లిస్తామని సంబం ధిత కాంట్రాక్టర్లకు తెలియజేయా లన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కే. కార్తీక్, డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, జడ్పీ సీఈవో మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగో పాల్, గంగాభ వానీ, డీఈవో బాలాజీరావు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అలసత్వం వహిస్తే సహించేది లేదు

● పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించబోమని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ప్రాం గణంలోని తిక్కనభవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్య లను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ శాఖ కూడా ఫిర్యాదులకు సంబంధించిన ఆడిట్ నిర్వహించాల న్నారు. కొన్ని శాఖలు అర్జీల పరిష్కారంలో వెనుకంజలో ఉన్నాయని తెలిపారు.

● రెవెన్యూదే అగ్రస్థానం

ఈ కార్యక్రమానికి మొత్తం 450 అర్జీలు రాగా, అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి 160 ఉన్నాయి. సర్వే ల్యాండ్ రికార్డుకు 52, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు 32, పంచాయతీరాజ్‌కు 36, స్కూల్ ఎడ్యుకేష న్‌కు 25, పోలీస్ శాఖకు 43 వినతులు వచ్చాయి. మిగిలినవి వివిధ శాఖ లకు సంబంధించినవి. అర్జీల స్వీకరణలో జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రతీ గింజను కొనుగోలు చేయాలి

ఎడగారులో పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని టీడీపీ జిల్లా, రాష్ట్ర రైతు సంఘం నాయకులు సోమవారం కలె క్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రనేత రావూరు రాధాకృష్ణమనాయుడు మాట్లాడుతూ ఎంటీయూ 1010 వరి ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులు కొనుగోలు చేయమని ప్రకటించారన్నారు. జిల్లాలో ఎక్కువగా ఆ రకాన్ని పండించారని తెలిపారు. ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

● నగరంలోని 17వ డివిజన్ పరిధి కార్పొరేషన్ పార్కు స్థలంలో ఎంకేలే అవుట్‌వారు ప్లాట్లు వేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కటకం చైతన్య జేసీకి నతిపత్రం సమర్పించారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 105 ఫిర్యాదులు

నెల్లూరు (క్రైం), జూలై 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కి జిల్లావ్యాప్తంగా 105 మంది ఫిర్యాదుదారులు తరలి వచ్చారు. వారి వారి సమస్యలను అధికా రులకు విన్నవించుకున్నారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీక రించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదు లపై త్వరితగతిన స్పందించి పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ కే. సీహెచ్ రామా రావు, డీటీపీ సీఐ ఎం. నాగేశ్వరమ్మ, పీసీఆర్ పీ. భక్తవత్సలరెడ్డి, ఎస్బీ సీఐ శ్రీనివాసరెడ్డి అర్జీలను స్వీకరించారు.

● జలదంకికి చెందిన ఓ వ్యక్తికి బిట్రగుంటకు చెందిన చైతన్యకుమార్ పరిచయమ య్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.80 లక్షలు నగదు తీసుకున్నాడు. అ ఉద్యోగం ఇప్పించ కుండా, నగదు తిరిగి ఇవ్వ కుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

● ఉదయగిరికి చెందిన ఓ మహిళను అదే ప్రాంతా నికి చెందిన విష్ణు వర్ధన్ ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. చివరికి తమ ఇంట్లో వారు ఒప్పుకోవం లేదని పెళ్లికి నిరాకరించాడు. ఈ విషయమై విచారించి న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

● నగరంలోని నవాబుపేటకి చెందిన ఓ మహిళకు గుంటూరు జిల్లా గురజాలకు చెందిన షేక్ జానీబాషతో పరిచయం ఏర్పడుతుంది. జానీబాషా నగరంలోని ఓ బ్యాంకులో పనిచేస్తున్నట్లుగా చెప్పి, రుణం ఇప్పిస్తానని నమ్మించి ఆమె వద్ద నుంచి ఇంటి కాగితాలు, రూ.3 లక్షల నగదు తీసుకున్నాడు. రుణం ఇప్పించకుండా, తీసుకున్న నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య



బోధనలో కొత్తదనానికి ఉపాధ్యాయులకు కరదీపికలు

జిల్లాలోని పాఠశాలలకు పంపిణీ

నెల్లూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యా వస్థలో మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఉపాధ్యాయులకు కరదీపిక(టీచర్ హ్యాండ్ బుక్స్)లను ప్రవేశపెట్టింది. ఎస్‌ఈఆర్టీ సహకారంలో సమగ్రశిక్ష ద్వారా సామర్థ్య ఆధారిత బోధన, అభ్యాస న ఉపాధ్యాయ వనరు పేరుతో వీటిని రూపొందించా రు. బోధనలో కొత్తదనాన్ని ప్రోత్సహించేలా, మూస వి ధానానికి తిలోదకాలిచ్చేలా ఇవి రూపుదిద్దుకున్నాయి. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వీటిని పంపిణీ చేశారు.

● మంచి ఫలితాలు సాధించేలా...

విద్యార్థులకు నాణ్యమైన విద్యాప్రమాణాలను అందించడంతోపాటు పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా విద్యారంగంలో మార్పులు చేపడుతున్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 1 నుంచి 10వతరగతి వరకు బోధన అందించే టీచర్లకు ఉపాధ్యాయుల కరదీపికలను అందించారు.వీటితోపాటు నైపుణ్యం పెరగడం, ప్రశ్నపత్రాలను సులభంగా తయారు చేసుకోవడం కూడా సులవవుతుందన్నారు. అలాగే ఈ బుక్‌ను అకడమిక్ క్యాలెండర్‌లోని పనిదినాలతో అనుసంధానం చేశారు. ఏ రోజు ఏ చాప్టర్, ఏ టాపిక్ ఎలా చెప్పాలో తేదీలతో సహా పొందుపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఒక రోజు ఒకే పాఠం బోధనలో ఉంటుంది. పాఠం పూర్తయిన తరువాత ప్రతి పీరియడ్‌లో బోధనా సమయం, ఉపయోగించిన టీఎల్ఎం, అభ్యసన కృత్యాలు, రిమార్కులను ఉపాధ్యాయులు కరదీపిలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆయా తరగతుల్లో సబ్జెక్టుకు సంబంధించి ఓ పుస్తకం ఉండే ఈ పుస్తకాలను తొలుత ఉపాధ్యాయులు క్షుణ్ణంగా చదవాల్సి ఉంటుంది. దీనిద్వారా పిల్లలకు సులభతరంగా బోధన అందించేందుకు, నోట్స్ తయారు చేసుకునేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు.

కామాక్షితాయి అన్నదాన సదనానికి రూ.10 లక్షల విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలం లోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆల య నిత్యాన్నదాన సదనానికి చెన్నై నగరంలోని ముగ లివాకం వాస్తవ్యులు కే. మల్లికార్జున, ప్రభావతి దంపతులు సోమవారం రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డిని కలిసి వారు చెక్కును అం దజేశారు. దాతలు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వా మి, అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారికి తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందజేశారు.



ఈవో శ్రీనివాసులురెడ్డికి చెక్కు అందజేస్తున్న దాతలు మల్లికార్జున, ప్రభావతి దంపతులు

ప్రతీ ఎకరా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలి : డీఏవో

నెల్లూరు (వ్యవసాయం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగవుతున్న పంటలకు సం బంధించి ప్రతీ ఎకరాను ఈ-క్రాప్‌లో నమోదు చేయా లని జిల్లా వ్యవసాయాధి కారి(డీఏవో) పీ.సత్య వాణి అధికారులను ఆదేశిం చారు. జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ)లో సోమవారం ఆత్మ ఆద్వర్యంలో ఖరీఫ్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హత లభించిన కొంత మందికి బ్యాంకు ఎన్‌పీసీఐ లింకు కాలేదని, వారంతా త్వరితగతిన లింకు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా వ్యవసాయ యాంత్రీకరణ, క్రాప్ ఇన్సూరెన్సు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ తదితర అంశాలపై ఆమె సూచనలు ఇచ్చారు. అనంతరం ఆత్మ పరిధిలో శిక్షణలు, ప్రదర్శన క్షేత్రాలు, విజ్ఞాన యాత్రలు, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రైతు క్షేత్ర పాఠశాలలు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, కిసాన్‌మేళా తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆత్మ డీపీడీ మురళి, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త వినీత, మత్స్యశాఖ అధికారి చాంద్‌బాషా, సెరీకల్చర్ అధికారి సత్యనారాయణ, ఉద్యానశాఖ అధికారి అనురాధ, కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కు మార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

కనీస వేతనం కోసం వీఆర్ఏల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

నెల్లూరు (వైద్యం) జూలై 28 (ఆంధ్రజ్యోతి) : తమకు కనీసం రూ. 26వేలు ఇవ్వాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం వీఆర్ఏల సంఘం నాయకులు నగరం లోని వీఆర్సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహిం చారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ఏనిమిది ఏళ్లగా వీఆర్ఏలకు ఒక్క రూపాయి కూడా వేతనం పెరగ లేదన్నారు. తెలంగాణాలో వీఆర్ఏలను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచిందన్నారు. రాష్ట్రంలో నామినీలుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వం నేటికి గుర్తించడం లేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనర్సయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లచ్చయ్య, ఓబులేసు, నాయకులు సుబ్బయ్య, సుధాకర్, అమీర్, శ్రీనివాసులు తదితరు లు పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో మెగా జాబ్‌మేళా : ఆనం



అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి

ఆత్మకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత మైన ఆత్మకూరు నియోజక వర్గంలోని నిరుద్యోగ యువ తకు ఉపాధి, ఉద్యోగ అవకా శాలు కల్పించడమే లక్ష్యంగా ఆగస్టు 2, 3 తేదీల్లో ఆత్మ కూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వ హిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఆంధ్ర ఇంజ నీరింగ్ కళాశాలలో సోమ వారం సాయంత్రం ఆయన మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, నిర్వహణ బాధ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్, నారాయణ సహకా రంతో నిర్వహించనున్న జాబ్‌మేళాను ఆత్మకూరు నియోజకవర్గంలో ఐటిఐ, పాలిటె క్నిక్, ఇంజ నీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్యను అభ్యసిం చిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసు కునేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

● చేజర్ల మండలం కోటితీర్థం శివాలయంలో మంత్రి ఆనం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పుకంభంపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూ.3 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. స్థానిక గిరిజన కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు గిరినాయుడు, కొమ్ము పార్థసారథి, షేక్ సిరాదుద్దీన్, శ్రీనివాసులునాయుడు, కొమ్మి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పుచేసి వంటలు...!

● మధ్యాహ్న భోజనానికి అందని బిల్లులు

● జూనియర్ కళాశాలల్లో నిర్వాహకుల అవస్థలు

ఉదయగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే పనిలేకుండా కళాశాలలోనే నాణ్యమైన ఆహారాన్ని అందిం చాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా పీఎం పోషణ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జనవరి నుంచి అమలు చేసింది. అప్పటి నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి వంట చేయాల్సిన దుస్థితి నెలకొందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● 25 జూనియర్ కళాశాలల్లో..

జిల్లాలో 25 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 51,854 మంది విద్యార్థులు చదువుకుంటు న్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సమీపంలో ఉన్న నిర్వాహకులు వంట చేస్తున్నారు. అయితే వారికి జనవరి నుంచి ఇప్పటి వరకు కూరగాయలు, పప్పులు, కట్టెలు, గ్యాస్, ఇతర సామగ్రికి సుమారు రూ.2 కోట్ల వరకు బిల్లులు బకాయిలు ఉన్నాయి. అలాగే నిర్వాహకుడికి, సహాయకునికి ఒక్కొక్కరికి నెలకు రూ. 3వేల చొప్పున వేతనాలు చెల్లిస్తారు. ఆ వేతన బకాయిలు సైతం రూ.లక్షల్లో పేరు కుపోయాయి. బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని స్థితిలో నిర్వాహకులు ఉన్నారు. పలుమార్లు ఉన్నతాధి కారులను సంప్రదించినా బిల్లులు వస్తాయి.. వంట చేయండని సూచిస్తున్నారే తప్ప చేయూతనందించ డంలేదని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు.

● నిర్వహణ భారం

ఒకవైపు పాఠశాల, మరోవైపు కళాశాలలో మధ్యాహ్న భోజనానికి వంట చేయడం భారంగా మారిందని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు. 9, 10వ తరగతులు, ఇంటర్ విద్యార్థులకు ప్రస్తుతం రోజుకు రూ.8.57 ప్రభుత్వం చెల్లిస్తుంది. నిత్యావసర సరుకులు, కూరగా యల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దుకాణాల్లో నెలవారీ ఖాతా లు పెట్టి సరుకులు తెస్తున్నాం. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో అప్పులు చేసి వ్యాపారులకు నగదు చెల్లించి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● త్వరలో బిల్లులు విడుదలవుతాయి

ప్రభుత్వ కళా శాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకా నికి సంబంధించి బిల్లులు మంజూరు కాని విషయం వాస్తవమే. ఈవిష యాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. త్వరలో నిర్వా హకుల ఖాతాకు నగదు జమ చేస్తామని చెప్పారు.

- వరప్రసాద్‌రావు, ఆర్ఐవో, నెల్లూరు



ఉదయగిరి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం కోసం క్యూలో ఉన్న విద్యార్థినులు

శిక్షణలో మనుబోలు ఎంపీడీవో

● ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఏవో

మనుబోలు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో విధుల నిర్వహణ, పరిపాలన గురించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఎంపీడీవోలుగా బాధ్య తలు తీసుకున్నవారందరికీ నెలరోజులపాటు బాపట్లలో శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణకు మనుబోలు ఎంపీడీవో కే. జలజాక్షి వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి ఎంపీ డీవోగా మండలపరిషత్ కార్యాలయ ఏవో ముజీబున్నీసాకు బాధ్యతలు అప్పగించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9448
వెండి కిలో ధర	రూ. 116500
వెండి ఒక గ్రాము	రూ. 119.50



రాయితీలను సద్వినియోగం చేసుకోండి

జ్యోత్స్నారాణి, వ్యవసాయ అధికారి ముత్తుకూరు

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం ఇచ్చే పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మం డల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నారాణి తెలి పారు. రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

?. ఖరీఫ్ సీజన్‌లో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి.

!. సాగు ప్రారంభానికి ముందు భూసార పరీక్ష చేయించి మట్టిలో పోష కాలు తెలుసుకోవాలి. భూసార పలితాల ప్రకారం ఎరువు లను వాడుకోవాలి. సమతలమైన తడులు తయారు చేసి, నీటి నిల్వకు అనుకూలంగా చేయాలి. నాణ్యమైన విత్తనాలు ఎంచుకుని, ట్రైకోడెర్మా లేదా కార్బెండాజియమ్‌తో శుద్ధి చేయాలి.

?. ప్రభుత్వం రైతులకు ఏఏ రాయితీలు అందిస్తోంది.

!. రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీతో ప్రభుత్వం సరఫరా చేస్తోంది. రైతు సహాయక కేంద్రా లలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వ్యవసాయానికి సాంకేతిక పరిజ్ఞానం జోడిం చేందుకు 80 శాతం రాయితీతో డ్రోన్లను సర పరా చేస్తున్నారు.

?. పైరుకు తెగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి

!. సాగు ప్రారంభ దశలో బ్లాస్ట్ తెగులు సోకే ప్రమాదం ఉంటుంది. బ్లాస్ట్ నివారణకు ట్రైసైకాజోల్ మందులను వాడాలి. పైరులో ఎండు తెగులుకు స్ట్రెప్టో మైసిన్, టెట్రాసైక్లిన్ కలిపి పిచికారీ చేయాలి. ప్రారంభం నుంచే పంటను పరిశీలించి ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలి.

గ్రీవెన్స్‌లో మూడే అర్జీలు



సమస్యను వింటున్న తహసీల్దార్

మనుబోలు, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగానికి ప్రజల నుంచి మూడు అర్జీలు మాత్రమే వచ్చాయి. దారి, ఇతర భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు బాధితులు విన్న వించారు. త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. డీటీ ప్రదీప్, ఎంఈవో రమేష్, డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీవో ముజీబున్నీసా, పీఆర్ ఏఈ, విజయభాస్కర్, సీహెచ్‌వో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

కోవూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ఆందోళన చేపడతామని సీపీ ఎం మండల కమిటీ కార్యదర్శి గండవరపు శేషయ్య తెలిపారు. స్థానిక సీతా పోలయ్య భవనంలో సోమవారం కరపత్రాల్ని విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జ య్య, సుబ్బారావు, హరి, పెద్దబ్బయ్య, చాంద్ బాషా పాల్గొన్నారు.

చెరువు దారి ఆక్రమణ



వినతిపత్రం సమర్పిస్తున్న దొమ్మరపాళెంవాసులు

కోవూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కోవూ రు చెరువుకు వెళ్ళే దారిని ఓ మహిళ దౌర్జ న్యంగా ఆక్రమించి మరుగుదొడ్డిని నిర్మించి నట్లు దొమ్మరపాళేనికి చెందిన పలువురు సోమవారం తహసీల్దారు సుబ్బయ్యకు విన తిపత్రం సమర్పించారు. తమ పూర్వీకుల హయాం నుంచి నివాసముంటున్నామని, చెరువుకు వెళ్ళే దారిని ఆక్రమించడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. రెవెన్యూ అధి కారులు స్పందించి అక్రమ కట్టడాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించినవారిలో టీడీపీ నాయకులు నాటకరాని వెంకట్, ఎం శంకర్, ఎం విజయ కుమార్ తదితరులున్నారు.

లేఅవుట్ క్రమబద్ధీకరణ స్కీంలో సవరణలు

● కమిషనర్ బాలకృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ శాఖ ఈనెల 26న జారీ చేసిన జీఓ ఎంఎస్. నెంబరు 134 ప్రకారం లేఔట్ క్రమబద్ధీకరణ స్కీం 2020కి ప్రభుత్వం కొన్ని సవరణలు చేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025 జూన్ 30కి ముందు రిజిస్ట్రేషన్ అయిన లేఔట్లు, ప్లాట్లను క్రమద్ధీకరించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. బుచ్చి నగర పంచాయతీ పరిధిలో రిజిస్ట్రేషన్ అయిన అన్ని లేఔట్లు, ప్లాట్లను ప్రభుత్వం నిర్దేశించిన మేరకు 10 శాతం పబ్లిక్ ప్లేస్ లేదా 14 శాతం పబ్లిక్‌ప్లేస్ పీనలైజేషన్ చార్జీలతో సహా చెల్లించి క్రమద్ధీకరించుకోవాలన్నారు. లేఔట్ల యజమానులు, డెవలపర్లు, కొనుగోలుదారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.

సమాజం పట్ల బాధ్యత.. నిబద్ధత ఉండాలి

న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

వెంకటాచలం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సమాజం పట్ల నిబద్ధత కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎన్నటికీ మరవద్దు' అనే సందేశంతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. తల్లిదండ్రుల ప్రేమ అమృతం కన్నా తీయనిదని, భూమ్యాకాశాలకన్నా వారు గొప్పవారన్నారు. యువత నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా కుటుంబ వ్యవస్థ విశిష్టతను అవగాహన చేసుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలన్నారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా పెద్దలను గౌరవించే సంస్కృతిని పెంపొందించుకోవాలన్నారు. ఏ అవసరం వచ్చినా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

కార్యక్రమంలో సెంట్రల్ జైలు సోషల్ ఇంక్యుబేషన్ కమిటీ సభ్యుడు ఎం మాలకొండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచలోరి నిత్యాన్న పథకానికి విరాళం



నగదు అందజేస్తున్న ఆనంద్‌కుమార్

రాపూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్న పథకానికి రైల్వే కోడూరుకు చెందిన నాలబాల ఆనంద్ కుమార్, రోహిణీ లత దంపతులు సోమవారం రూ. 1,18,000 దేవస్థానం సిబ్బందికి అందించారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు మూడు ఆలయాల్లో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అంద జేశారు.

సీపీఎం పోస్టర్ల ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 2(ఆంధ్రజ్యోతి): బుచ్చిలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం 'పోరుబాట' పోస్టర్లను సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు ఆవిష్కరించారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వల్ల ప్రజలపై మరింత భారం పడుతుందని, అందుకే ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, జానీబాషా, ఖాదర్ బాషా, పడవల సుబ్రహ్మణ్యం, శుభకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి పదవిపై హర్షం

విడవలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని మహిళా, శిశు సంక్షేమ శాఖ దివ్యాంగులు, వృద్ధుల కమిటీ సభ్యురాలిగా నియమించడం హర్షణీయమని టీడీపీ 8వ క్లస్టర్ ఇన్‌చార్జి చెముకుల శ్రీనివాసులు తెలిపారు. విడవలూరులో సోమవారం అయన విలేకరులతో మాట్లాడారు. అనతికా లంలోనే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నియోజ కవర్గంలోనే కాక రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన

పొదలకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి, ప్రతి విషయంలోను అప్రమత్తంగా ఉండాలని శ్రీ గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసు కానిస్టేబుళ్లు సౌమ్య, వెంకటేష్‌ల ఆధ్వర్యంలో పాఠశాలలో బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరినీ గుడ్డిగా నమ్మి మోసపోవద్దన్నారు. అను మానం వస్తే వెంటనే తల్లిదండ్రులకు చెప్పాల న్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రబాబు, ఏడుకొండలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కానిస్టేబుల్ వెంకటేష్, సౌమ్య

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఐఎఫ్‌టీయూ డిమాండ్

సైదాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయు జిల్లా గౌరవ అధ్యక్షుడు డీపీ పోలయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వ హించారు. ఐఎఫ్‌టియు కార్యాలయం నుంచి ర్యాలీగా బస్టాండ్‌కు చేరుకుని రాస్తారోకో చేపట్టి అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి తహసీల్దార్ సుభద్రకు వినతి పత్రం అందజేశారు. నాయకులు కొండాపు చెంగళ్ రావు, డేగా శ్రీనివాసులు, అనీల్, వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



ధర్నాలో పాల్గొన్న చింతా మోహన్, తదితరులు

ముత్తుకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల వల్ల ఏర్పడుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. కృష్ణపట్నం పోర్టు, థర్మల్ కేంద్రాలు, పామాయిల్ పరిశ్రమల వల్ల ముత్తుకూరు, టీపీగూడూరు మండలాల్లో కాలుష్యం పెరిగిపోయిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ముప్పువాటిల్లే ప్రమాదం ఏర్పడిందన్నారు. పోర్టు పరిసర గ్రామాల ప్రజలకు గతంలో ప్రకటించిన విధంగా కుటుంబానికి రూ.18వేల ప్యాకేజీ ఇవ్వాలని ఆదాని యాజమాన్యాన్ని కోరారు. పరిశ్రమల్లో చుట్టుపక్కల గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కులాల వారికి రిజర్వేషన్ల ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని విజయవంతం చేయండి

రాపూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని విజయవంతం చేయాలని ఆర్టీసీ రాష్ట్ర ఈడీఓ అప్పలరాజు, జోన ల్ ఈడీ నాగేంద్రకుమార్ తెలిపారు. సోమవారం రాపూరు ఆర్టీసీ డిపోను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్టీసీ సిబ్బంది మహిళలను గౌరవించాలన్నారు. బస్సులో ఫుట్‌బోర్డు, సీట్లు సౌకర్యంగా ఉండేలా చూడాలని సూచించారు. అవసరాన్ని బట్టి బస్సు సర్వీసులను పెంచుతామని తెలిపారు. రాపూరు డిపోకు రెండు కొత్త సర్వీసులను మంజూరు చేశామని ఈసందర్భంగా తెలిపారు. అనంతరం ఆర్టీసీ డిపో ముందు మొక్కలు నాటారు. డీఎం అనీల్‌కుమార్, సీటీఎంలు, ఆర్టీసీ అధికారులు, గ్యారేజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీవో అప్పలరాజు

నిమ్మచెట్ల తొలగింపులో ఎమ్మెల్యే కురుగొండ్ల ప్రమేయం లేదు

● అసత్య ప్రచారాలు చేస్తున్న వైసీపీ నేతలు

సైదాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలకలపూండ్ల రెవెన్యూ కమ్మవారిపల్లి గ్రామం గద్దలతిప్ప వద్ద సర్వే నెంబర్ 793లో నిమ్మచెట్లను తొలగించడంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రమేయం లేదని మండల టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ కొండపోరంబోకు భూముల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు నిమ్మచెట్లు సాగు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేస్తే ఫిబ్రవరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేదలు సాగుచేసుకుంటున్న భూములను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పట్టాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పేదలు సాగు చేసుకుంటున్న భూముల్లో మైనింగ్ అనుమతులు ఇస్తే ఒప్పుకునే ప్రసక్తి లేదని పేదల పక్షాన ఎమ్మెల్యే మద్దతు తెలిపారన్నారు. కాగా, కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఓ వ్యక్తికి సంబంధించిన 500 నిమ్మచెట్లు తొలగిస్తే టీడీపీ ప్రమేయం ఉన్నట్లు వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ పేదలకు అండగా ఉండే నాయకుడన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి పెమ్మసాని దిలీప్ చౌదరి, మాజీ సర్పంచు అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, టీడీపీ రైతు మండల అధ్యక్షుడు కేపీ రాజు, మండల సీనియర్ నాయకులు తక్కెళ్ళ దశయ్య నాయుడు, మేడికొండ రమణయ్య నాయుడు, వరిగొండ సురేంద్ర, కోటయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పరిశ్రమల ఏర్పాటుకు భూముల పరిశీలన

కలిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరు పంచాయతీ పరిధిలో సోమవారం పరిశ్రమల ఏర్పాటుకు భూములను ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ శివప్రసాద్, తహసీల్దారు గిరీష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ మండలంలో పెదకొండూరు ప్రాంతంలో సుమారు 400 ఎకరాలు ప్రభుత్వ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి భూముల పరిశీలించామ న్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లీలాసుధి, సర్వేయరు ఎస్‌కే సోని, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చాక్‌పీస్‌పై జాతీయ జంతువు



మనుబోలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ కళాకారుడు, వీరంపల్లి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సోమా పద్మారత్నం సోమవారం చాక్‌పీస్‌పై పులి చిత్రాన్ని గీసి పాఠశాలలో ప్రదర్శించారు. మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా వాటర్ కలర్స్‌తో చాక్ పీస్‌పై చిత్రించిన సూక్ష్మపులి చిత్రాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సోమా పద్మారత్నంను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులే శ్రేయస్కరం

విడవలూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్ప త్తులు ఆరోగ్యానికి శ్రేయస్కరమని డీపీఎం రాజ్ కుమార్ తెలిపారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన కూరగాయలను సోమవారం స్థానిక తహ సీల్దారు కార్యాలయ ఆవరణలో ప్రజలకు అందు బాటులో ఉంచారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్ చార్జి మహేంద్ర, ఎఫ్ఎస్‌లు పుష్పరాజ్యం, చిన్న య్య, ఐసీఆర్పీలు కాలి దేవకుమార్, విజయ లక్ష్మి, మౌనిక, మైథిలి, సురేష్, నరేష్ పాల్గొన్నారు.



కూరగాయలు కొనుగోలు చేస్తున్న మహిళ

నేడు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాక

కావలి, జూలై 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం కావలి నియోజకవర్గంలోని కావలి, బోగోలు మండలాల్లో పర్యటించనున్న ట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలతో కలిసి మంత్రి కావలి మండలంలోని తుమ్మలపెంట, ఒట్టూరు గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాలలో పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని పేర్కొన్నా రు. అనంతరం బోగోలు మండలంలోని జువ్వలదిన్నెలో జలజీవన్‌మిషన్ పనులను ప్రారంభించి అనంతరం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను సందర్శిస్తారని పేర్కొన్నారు.



బస్సు ఢీకొని యువకుడి మృతి

● సోదరికి మందులు తీసుకెళ్తూ తిరిగిరాని లోకాలకు..



రవి మృతదేహం

కావలి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన తన సోదరికి మందులు తీసుకు వెళుతున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై తిరిగి రాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన కావలి మండలం చెంచుగానిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు... ముసునూరు అరుంధతీయవాడకు చెందిన పోతిపోక రవి(38) బీటెక్ పూర్తి చేసినా సెంట్రింగ్ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గౌరవరంలో ఉంటున్న తన అక్క బుజ్జమ్మకు వాంతులు, విరోచనాలు అవుతుండడంతో మందులు, కొబ్బరినీరు తెమ్మని రవికి సమాచారం ఇచ్చింది. దీంతో మందులు తీసుకుని మోటారు బైక్‌పై గౌరవరం బయలుదేరాడు. మార్గమధ్యంలోని చెంచుగానిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలో విజయవాడ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్ బస్సు వేగంగా మోటారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారు బైక్‌తో సహా రవి బస్సు కింద ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే మొబైల్ సిబ్బంది సమాచారంతో ఎస్ఐ తిరుమలరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా రవి మృతితో ముసునూరు అరుంధతీయవాడలో విషాదం అలుముకుంది.

హిజ్రాల వర్గపోరు

● పోలీసులకు ఫిర్యాదు ● కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 28(ఆంధ్రజ్యోతి): 'మా గ్రూపులో ఉంటూ ఆ గ్రూపులోకి ఎలా వెళతావు' అంటూ ఓ హిజ్రాపై తోటి హిజ్రాలు దాడిచేశారు. బాధిత హిజ్రా ఫిర్యాదు మేరకు నగరంలోని నవాబుపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు... కోవూరు వడ్డిపాలెంకు చెందిన హిజ్రా శిరీషను మాట్లాడాలని శిల్ప, అలేఖ్య పిలిచారు. దీంతో ఆమె ఆదివారం జనార్దన్‌రెడ్డి కాలనీకి వెళ్లింది. తనతో వారు మాట్లాడుతూనే శిల్ప, అలేఖ్య, రితిక, రీనులు దాడి చేశారని శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే శిరీషపై దాడి జరిగిందని తెలుసుకున్న శీలా వర్గానికి చెందిన హిజ్రాలు, శిల్ప, అలేఖ్య వర్గానికి చెందిన హిజ్రాలు ఆదివారం అర్ధరాత్రి నవాబుపేట పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు వెంటనే స్టేషన్ వద్దకు చేరుకొని, పరిస్థితిని చక్కదిద్ది అందరినీ అక్కడ నుంచి పంపించివేశారు. కాగా శిరీష తమ వర్గంలో ఉండగా, అవతలి వర్గంలోకి వెళ్లిందని, ఈ క్రమంలో శిల్ప, అలేఖ్య, రితిక, రీనూలు తమ వర్గంలోకి రావాలని ఆమెపై ఒత్తిడి చేశారు.

భర్త మృతిపై అనుమానాలున్నాయ్!

నెల్లూరు(క్రైం), జూలై 28(ఆంధ్రజ్యోతి): తన భర్త మృతిపై అనుమానాలున్నాయని ఆదివారం ఆత్మహత్య చేసుకున్న తరుణ్ తేజ భార్య ప్రవళ్లిక పేర్కొన్నారు. తరుణ్‌తేజ మృతదేహానికి జీజీహెచ్ మార్చురీలో వైద్యులు సోమవారం పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. మార్చురీ వద్ద ప్రవళ్లిక మీడియాతో మాట్లాడుతూ తరుణ్‌తేజ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడుకాదని, ఆయన స్నేహితురాలే హత్యచేసి ఆత్మ హత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని ఆమె ఆరోపించారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

అనంతసాగరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో బద్వేల్ రోడ్డుపై సోమవారం సాయంత్రం ఆటో బోల్తాపడ్డ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. అనంతసాగరం నుంచి వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తూ గాయపడిన ఆర్ పవన్‌కల్యాణ్, రఘురామ్‌ను 108 వాహనంలో సాగరం ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

మద్యం స్వాధీనం

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తిరిగి నీటిని సరఫరా చేసే వైసీపీ నాయకుడికి చెందిన ఆటోలో ఇతర రాష్ట్రానికి చెందిన మద్యం పట్టుబడిన సంఘటన దుత్తలూరులో సోమవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దుత్తలూరు పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో దుత్తలూరుకు చెందిన కంభం ప్రభాకర్‌రెడ్డి గత కొన్నేళ్లుగా శుద్ధిజల కేంద్రం నడుపుతున్నాడు. ఈక్రమంలో సోమవారం నీటిని సరఫరా చేసే ఆటో నడుపుతున్న డ్రైవర్ మనోజ్‌తో కట్టకిందపల్లె కాలనీకి చెందిన కొందరితో వివాదం జరుగుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆటోను తనిఖీ చేయగా వాటర్‌ట్యాంక్ కింద కర్ణాటక రాష్ట్రానికి చెందిన 11 మద్యం టెట్రా ప్యాకెట్లు దొరికాయి. దీంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

కొడవలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొడవలూరులోని ఎన్టీఆర్ కాలనీలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. రూ. లక్షా 20 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. 6 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ కోటిరెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో 14 గొర్రెల మృతి

రూ. 2 లక్షల ఆస్తి నష్టం



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

బుచ్చిరెడ్డిపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో 12 గొర్రెలు, 2 పొట్టేళ్లు మృత్యువాతపడిన సంఘటన మండలంలోని కొత్త మినగల్లు గ్రామం దళితవాడలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు నెత్తుటి మడుగులో పడి ఉన్న మూగ జీవాలను గుర్తించి వెంటనే యజమానికి చెప్పారు. కొత్త మినగల్లు దళితవాడలో నిరుపేద కుటుంబానికి చెందిన గడ్డె లచ్చయ్యకు గొర్రెలే జీవనాధారం. తన మొత్తం 20 గొర్రెలలో కుక్కల దాడిలో 14 మృతి చెందాయి. ఇక 4 గొర్రెలే మిగిలడంతో యజమాని లచ్చయ్య గుండెలు బాదుకున్నాడు. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఆదివారం రాత్రి తన గొర్రెలను దొడ్డిలో తోలిన లచ్చయ్య నిద్రలేచేసరికి కుక్కలదాడిలో 14 గొర్రెలు మృతి చెందడంపై తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. సమాచారంతో పశువైద్యులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతి చెందిన గొర్రెల యజమానిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

బదిలీ అయిన టీచర్లకు జీతాలు చెల్లించాలి

నెల్లూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.నరసింహం కోరారు. సోమవారం నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో జరిగిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేడర్ స్ట్రెంగ్త్‌ను అప్‌డేట్ చేసి, ఆగిన రెండు నెలలు జీతాలు అందించాలన్నారు. అలాగే 1998, 2008 అప్రెంటీస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ 62 ఏళ్లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధ్యాయవాణి మాసపత్రికను ఉపాధ్యాయులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ గౌరవాధ్యక్షుడు రాజమనోహర్,జిల్లా నాయకులు నారాయణరెడ్డి, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, శివకృష్ణలతో పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేకాధికారులు

● ఎంహెచ్‌వో కనకాద్రి

నెల్లూరు(సిటీ), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నట్లు ఎంహెచ్‌వో డాక్టర్ కనకాద్రి తెలిపారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో చేపట్టిన చర్యల గురించి ఆయన వివరించారు.

?: పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నారు. ఈ సమయంలో తీసుకున్న చర్యలు.

!: ప్రైవేటుగా కార్మికులను, వాహనాలను తీసుకుంటున్నాం. అదనపు సమయం కేటాయించి ప్రజలకు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాం.

?: పర్యవేక్షణ అధికారుల లోటుపై ఏమంటారు.

!: వారి లోటు ఏర్పడకుండా ప్రతీ నాలుగు డివిజన్లకు ప్రత్యేకాధికారిని ఏర్పాటు చేస్తున్నాం. వాకె యంత్రాలతో పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తారు.

?: బ్లాక్ స్పాట్లను గ్రీన్ స్పాట్లుగా చేయాలనుకున్నారు.. సాధ్యమవుతుందా.

!: బ్లాక్ స్పాట్ల వద్ద పేరుకుంటున్న చెత్తను సేకరించేందుకు యంత్రాలను కూడా ప్రైవేట్‌గా తీసుకుంటున్నాం. వీటి సహాయంతో ఎప్పటి చెత్తను అప్పుడు తీసుకెళ్లిపోతాం.

?: కార్మికుల సమ్మెతో పారిశుధ్య లోపం ఏర్పడిందా..

!: ఇప్పటికైతే ఇబ్బందిలేదు. కానీ నగరవాసుల సహకారం ఈ సమయంలో ఎంతో ముఖ్యం. చెత్తను రోడ్లు, కాలువల్లో వేయకుండా కుండీలు, వాహనాల్లోనే అందిస్తే సమస్య తీరుతుంది. పారిశుధ్య సమస్యలపై నా నంబరు 99899 90859కు తెలియచేయవచ్చు.

బీజేపీ ప్రభుత్వంలో పెచ్చుమీరిన అవినీతి

● చింతా మోహన్

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 28 (ఆంధ్రజ్యోతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో అవినీతి విపరీతంగా పెరిగిపోతుందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ చింతా మోహన్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.14.50 కోట్లను బ్యాంకులు రుణమాఫీ చేశాయని, రూ.లక్షల కోట్లు అవినీతి జరిగిందని దేశమంతా చర్చించుకుంటున్నారని తెలిపారు. ప్రధాని మోదీ, అమిత్‌షా, నిర్మలా సీతారామన్ రుణమాఫీ లెక్కలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంపై ఈడీ, సీబీఐలు విచారణ చేపట్టాలని కోరారు. అరకులో ఆదీవాసులపై దాడులు ఘోరంగా మారాయన్నారు. ఏపీ ప్రభుత్వం గాడి తప్పిందన్నారు. లిక్కర్ స్కీమ్‌లో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందంటున్నారని ఆయన పేర్కొన్నారు. సిట్ రిపోర్టును వెంటనే బయటపెట్టి ప్రజలకు నిజాలు తెలియజేయాలని కోరారు. మైనింగ్, ఇసుకరీచ్‌ల దోపిడీలను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖాసీంకు విశిష్ట సామాజిక సేవా అవార్డు

నెల్లూరు (హరనాథపురం) జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జాషువా గ్రంథాలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్.ఖాసీంకు విశిష్ట సామాజిక సేవా అవార్డు -2025ను దయా డాట్ ఫౌండేషన్ అందజేసింది. ఆదివారం రాత్రి నగరంలోని రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో నారాయణ మెడికల్ గ్రూప్స్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు.

ప్రతి విద్యార్థికి ఓ మొక్క

● దాని పురోగతికి గ్రీన్ పాస్‌పోర్ట్
● ప్రతి ఏడాది పాయింట్ల కేటాయింపు
● జిల్లాలో 1,22,693 మొక్కల పంపిణీ

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే మొక్కలను పెంచి, వాటిని పరిరక్షించేలా పాఠశాల విద్యా శాఖ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి ఒక మొక్కను అందించి దాన్ని కాపాడే బాధ్యతను కూడా అప్పగించింది. మానవ జీవనానికి మొక్కలే ప్రధానమని, వాటిని పెంచితేనే ఓజోన్ పొరను రక్షించగలమని, ఆహ్లాద, ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందగలమని అవగాహన కల్పిస్తూ మొక్కతోపాటు విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్ట్‌లను అందచేశారు.

నెల్లూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మొక్కల పెంపకంలో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో



మొక్కలు అందుకున్న విద్యార్థులు (ఫైల్)

వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం దీన్ని పక్కాగా అమలు చేస్తోంది. రాష్ట్రంలో కోటి మొక్కలు పెంచాలన్న ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయాలని, వాటి పెంపకంపై ఆసక్తిని కలిగించి వాటిని పరిరక్షించాలని తెలిపారు. దీంతో ఇటీవల జరిగిన మెగా పీటీఎంలో ఈ కార్యక్రమ నిర్వహణపై చర్చించి అందరి ఆమోదంతో ప్రతి విద్యార్థికి ఒక మొక్క అందించి దాన్ని పరిరక్షించడంతోపాటు మొక్కకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేలా వారికి 'మొక్క ఎదుగుదలతో నా ప్రయాణం' అనే ట్యాగ్‌తో గ్రీన్ పాస్‌పోర్టులను కూడా అందచేశారు. సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టులో మార్కులు, ఇతర వివరాలు ఎలా నమోదు చేస్తారో, ఈ గ్రీన్ పాస్‌పోర్టులో కూడా విద్యార్థి పెంచే మొక్క పేరు, శాస్త్రీయ నామం, వ్యవహారిక నామం, దాని వివరాలన్నీ ఇందులో నమోదు చేయాలి. విద్యార్థులకు అందించే మొక్కను వారు తమకు నచ్చిన చోట నాటుకోవచ్చు. రోజూ మొక్కను పరిశీలించడంతోపాటు దానిని పరిరక్షిస్తూ ఆ వివరాలను గ్రీన్ పాస్‌పోర్టులో నమోదు చేయాలి.

● విద్యార్థులకు పాయింట్లు

మొక్కల పెంపకంపై పాస్‌పోర్టులో వివరాల ప్రకారం ఏడాదికి రెండుసార్లు ఉపాధ్యాయులు పరిశీలించి ప్రతి విద్యార్థికి గరిష్ఠంగా ఐదుపాయింట్లు కేటాయిస్తారు. జిల్లాలో మొత్తం 2,879 పాఠశాలలకుగాను 2,787 స్కూళ్లు మొక్కల పెంపకానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. వీటిలో 74,3 69 మంది విద్యార్థులకు 73,395 మంది మొక్కల పెంపకానికి ముందుకు వచ్చారు. వీరందరికీ సామాజిక అటవీ విభాగం నుంచి మొత్తం 1,22,693 మొక్కలను అందచేశారు. ఒక్కో విద్యార్థికి మూడు మొక్కలు తీసుకునే అవకాశం ఉండడంతో ఆసక్తి కలిగిన వారు ఒకటి నుంచి మూడు మొక్కలు వరకు తీసుకున్నారు. సీమబాదం, ఎర్రచందనం, దేవకాంచన, అంకుడు, గానుగ, వేప, తురాయి, మహాగని, మామిడి ఇలా అన్ని రకాల జాతులకు చెందిన మొక్కలు అందచేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు మొక్కలు అందించడంతోపాటు నిత్యం వాటి గురించి అడిగి తెలుసుకుంటున్నట్లు చెప్పారు.



తల్లితో కలిసి మొక్క నాటుతున్న విద్యార్థినులు

బీద రవిచంద్రకు అభినందనల వెల్లువ



ఎమ్మెల్సీ బీద రవిచంద్రను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ బీసీ నేతలు

నెల్లూరు (వైద్యం) జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాల సంక్షేమ కమిటీ చైర్మన్‌గానూ, శాసనమండలి సభా నియమాల కమిటీ సభ్యులుగానూ నియమితులైన ఎమ్మెల్సీ బీద రవిచంద్రను సోమవారం టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు అభినందనలతో ముంచెత్తారు. నగరంలోని బీద నివాసానికి టీడీపీ నేతలు, బీసీ సంఘాల నేతలు భారీగా తరలివచ్చి, పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, శాలువాతో రవిచంద్రను సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు. ముదిరాజ్ సాధికార సమితి కన్వీనర్ పీఎల్ రావు నేతృత్వంలో బీసీ సంఘాల నాయకులు ఆయన్ను గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు వెనకబడిన వర్గాల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా, శాసనమండలి నియామకాల కమిటీ సభ్యులుగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించటం ఎంతో సంతోషంగా ఉందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్సీ రవిచంద్ర నివాసంలో శాలువా, పుష్పగుచ్ఛంతో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ కుమార్, నాయకులు కలవకుంట భాస్కర్, వీరమల్లు చంద్ర, సుధా, కంచికృష్ణ, రంగన్న, లోకేష్, సునీల్‌సింగ్‌గౌడ్, సాయికృష్ణ, జమీర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి రాకతో పుంజుకున్న రంగాలు

నెల్లూరురూరల్, జూలై 28,(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్నీ రంగాలు పుంజుకున్నాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం 22వ డివిజన్‌లో సీసీరోడ్లు, డ్రైన్ల ర్యాంపులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాదికాలంలో ఈ డివిజన్‌లో రూ. 3.25 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆహర్నిశలు కష్టపడుతున్న సీఎం చంద్రబాబును ప్రజల ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద అభివాదం చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

వ్యాధులు ప్రబలకుండా అవగాహన పెంచుకోవాలి

నెల్లూరు (వైద్యం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ తెలిపారు. సోమవారం నగరంలోని మహాత్మాగాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో దోమల వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కలిగించారు. ఆమె మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల సంక్రమణ - దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇంట్లో ప్రతీ ఒక్కరు దోమ తెరలు వాడాలన్నారు. ఇంటిలో నీటినిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. వేదమూర్తి, పట్టణ ఆరోగ్య కేంద్రం కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, మలేరియా విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరిస్తున్న హుస్సేనమ్మ

వైభవంగా ఆండాళ్ తిరునక్షత్రం వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సోమవారం తిరువాడిప్పూరం (ఆడి నెల పుబ్బ నక్షత్రం) ఆండాళ్ అమ్మవారి జన్మ నక్షత్రం వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం రంగనాథస్వామి, ఆండాళ్ అమ్మవారికి పేట ఉత్సవం, తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ప్రాకారోత్సవం, ఎదురుకోలు ఉత్సవం, మాలమార్పు ఉత్సవం జరిపారు.ఈ కార్యక్రమాలను ఈవో ఏవీ శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

జిల్లా ఏర్పాటుకు చేయూతనివ్వాలి

● ఎమ్మెల్యే దగుమాటికి సాధన సమితి వినతి

ఉదయగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాల పునర్విభజనలో భాగంగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినందున ఉదయగిరి కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు చేయూతనివ్వాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని జిల్లా సాధన సమితి కోరింది. సోమవారం కావలిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఉద్యమ నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరి అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి ఉద్యమ నాయకులు నాని, మురళి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు దీవెనయాత్ర ప్రారంభం



శ్రీవారి ఉచిత దీవెనయాత్రలో పాల్గొన్న నజీర్‌బాషా, భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): సత్యమార్గ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని జ్యోతి వినాయక స్వామి మందిరం నుంచి తిరుమలకు 28వ ఉచిత దీవెనయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రను గీతా వైభవ ట్రస్ట్ చైర్మన్ షేక్.నజీర్‌బాషా, సత్యమార్గ్ ఫౌండేషన్ బాధ్యులు రవిస్వామి జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రలో పాల్గొన్న భక్తులు అలిపిరి మార్గంలో మెట్లకు పూజ చేస్తూ వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా భక్తులకు భగవద్గీతను పంపిణీ చేశారు.

మహాకుంభాభిషేకాల ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో సోమవారం నుంచి దేవస్థానం, విమాన గోపురం, జీవధ్వజ, నవగ్రహ మండప పునః ప్రతిష్ఠ మహాకుంభాభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం స్వస్తివాచకం, మహాగణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, వాస్తు పర్యగ్నికరణం, బలిహరణలు, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాదాలు వితరణ జరిగాయి. ఈ కార్యక్రమాలకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌రెడ్డి-లత దంపతులు, ఆల్తూరు మహేష్‌రెడ్డి, మాధవయ్య సన్స్ ఉభయదాతలుగా వ్యవహరిస్తున్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర ఆకస్మిక మృతి

నెల్లూరు (వైద్యం) జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై తిరుపతికి వెళ్లిన డాక్టర్ నరేంద్ర సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. దీంతో జీజీహెచ్ వైద్యులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో నోడల్ ఆఫీసర్‌గా ఉన్న డాక్టర్ నరేంద్ర ఎంతో సమర్థవంతంగా ప్రజలకు వైద్య సేవలు అందేటట్లు చూశారు. రాత్రింబవళ్లు పనిచేశారు. పలు మార్లు జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా కూడా పని చేశారు. డాక్టర్ నరేంద్ర ఆకస్మిక మృతిని జీర్ణించుకోలేకపోతున్నామని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హంస జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్‌కిరణ్ కూడా సంతాపం తెలిపారు.



డాక్టర్ నరేంద్ర(ఫైల్)

కలుజులపై వంతెనలు నిర్మించాలి

నెల్లూరు (హరనాథపురం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): పొట్టేపాలెం, ములుమూడి కలుజులపై వంతెనలు నిర్మించాలని సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం జిల్లా నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యుడు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ మాట్లాడుతూ మూడు రోజుల నుంచి పొట్టేపాలెం కలుజువద్ద ధర్నా నిర్వహించామని చెప్పారు. ఇప్పటికైనా కలుజులపై బ్రిడ్జిలను నిర్మించి ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకయ్య, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌లో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పారిశుధ్య కార్మికులకు ఆప్కాస్ ద్వారానే జీతాలు

నెల్లూరు(సిటీ), జూలై 28,(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు ఆప్కాస్ ద్వారానే జీతాలు అందిస్తామని, ప్రస్తుత విధానంలో వారంతా కొనసాగుతారని కమిషనర్ నందన్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో మాట్లాడిన ఆయన నూరుశాతం పారిశుధ్యం ప్రజలకు అందించాలన్న ఉద్దేశ్యంతో మోడల్ డివిజన్ నిర్వహణలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా కాంట్రాక్టు పద్ధతిలో పనులు చేపట్టినట్లు తెలిపారు. ముందుగా పీజీఆర్‌ఎస్‌లో పాల్గొని నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు. ఆపై కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా నగరంలో పారిశుధ్య పనులను పరిశీలించారు.



పీజీఆర్‌ఎస్‌లో పాల్గొన్న అధికారులు

హాస్టళ్లను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



విలేకరులతో మాట్లాడుతున్న చేజర్ల

నెల్లూరు (వైద్యం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఉండే సంక్షేమ హాస్టళ్లలో గత వైసీపీ ప్రభుత్వంలో కనీస వసతులు కూడా కల్పించ లేదని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాలికలు ఉన్న హాస్టళ్లలో టాయిలెట్స్‌కు తలుపులు కూడా సరిగా లేవన్నారు. వారు అరకొర వసతులతో విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి వచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు హాస్టళ్లకు రూ. 143 కోట్లు కేటాయించారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిన స్కాలర్‌షిప్‌ల కోసం రూ. 788 కోట్లు విడుదల చేశారని ఆయన వివరించారు.

జగన్ పర్యటనలో మూడు వాహనాలకే అనుమతి

నెల్లూరు(క్రైం), జూలై 28(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 31న జిల్లా పర్యటనకు పోలీసులు అనుమతిచ్చారు. హెలిప్యాడ్ నుంచి నెల్లూరు సెంట్రల్ జైలు వరకు కాన్వాయ్‌తోపాటు మూడు వాహనాలకు మాత్రమే అనుమతించామని, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాకత్‌కు వెళ్లే సమయంలో పది మంది మాత్రమే జగన్‌తో ఉండాలని పోలీసులు పేర్కొన్నారు. కాగా కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసం వద్దకు కాన్వాయ్‌తోపాటు మూడు వాహనాలకు మాత్రమే అనుమతిస్తామన్నారు. ప్రసన్న ఇంటికి జగన్ వెళ్లినప్పుడు ఆయన వెంట ఎవరూ ఉండకూడదని ఆ అనుమతుల్లో పేర్కొన్నారు.

ఏపీ వడ్డెర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా దయాకర్



గుంజి దయాకర్

నెల్లూరు (హరనాథపురం) జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గుంజి దయాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో సోమవారం జరిగిన ఆ సంఘం మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా వెంకటయ్య, కార్యదర్శిగా గుంజి దయాకర్, కోశాధికారిగా చంద్రగిరి శివ నాగమల్లేశ్వరావు, ఉపాధ్యక్షులుగా బెల్లంకొండ బాలవెంకటేశ్వర్లు, జెరిపిటీ మోహన్, సహాయ కార్యదర్శులుగా తన్నీరు శ్రీరాములు, డేరంగుల పద్మనాభరాజు ఎన్నికయ్యారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



పింఛనుకోసం తిరిగి అలసిపోయా

ఐదు నెలలుగా పక్షవాతంతో బాధపడుతున్నా. కూలి పనులకు వెళ్లేందుకు కూడా శరీరం సహకరించడంలేదు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. పింఛను కోసం తిరిగి తిరిగి అలసిపోయా. ఇకనైనా పింఛనిచ్చి ఆదుకోండి.

- ఇదీ వెంకటగిరి పట్టణం అమ్మపాళేనికి చెందిన రాజమ్మ ఆవేదన. ఇలా జిల్లా వ్యాప్తంగా 260 మంది సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి పీజీఆర్ఎస్‌లో ఉన్నతాధికారులకు తమ సమస్యలను విన్నవించి వినతులిచ్చారు.

- 6లో

ప్రైవేట్ చేతికి టూరిజం హోటల్

- హరిత ప్రాజెక్టును చేజిక్కించుకున్న 'మృగవాణి'
- గత వైసీపీ హయాంలో జరిగిన టెండరు
- 33 ఏళ్లకు లీజు, ఏడాదికి రూ.కోటి అద్దె
- టెండరు దక్కించుకున్న 22 నెలల తర్వాత మొదలైన పనులు

తిరుపతి నగరం అలిపిరి సమీపంలోని రుయాస్పత్రికి ఎదురుగా ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) చేపట్టిన 103 గదుల హరిత హోటల్ ప్రాజెక్ట్ ఎట్టకేలకు ప్రైవేట్ చేతికి వెళ్లిపోయింది. 2023 అక్టోబరులో వైసీపీ హయాంలో నిర్వహించిన టెండర్లలో తక్కువ అద్దెతో దక్కించుకున్న 'మృగవాణి' రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 22 నెలల తర్వాత సోమవారం పనులు మొదలుపెట్టింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతిలో ఓ స్టార్ హోటల్ కట్టాలని ఏపీటీడీసీ నిర్ణయించింది. దీంతో 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తిరుమలకు వచ్చే యాత్రికులను దృష్టిలో పెట్టుకుని రూ.17 కోట్ల బడ్జెట్‌తో హరిత హోటల్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇందులో రూ.7 కోట్లను విడుదల చేయడంతో నిర్మాణ పనులు వేగంగా జరిగాయి. 1.03 ఎకరాల విస్తీర్ణంలో తొలిదశలోనే భవన నిర్మాణపు సివిల్ వర్క్ దాదాపు పూర్తయిపోయింది. ఇంతలో అధికారుల అలసత్వమో, రాజకీయ కారణమో తెలియదుకానీ హరిత హోటల్ ప్రాజెక్టు ముందుకు కదలలేకపోయింది. ఈక్రమంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణకు ఇవ్వాలని 2020 ఆగస్టు 27న ఈ-టెండర్ నిర్వహించింది. హైదరాబాద్‌కు చెందిన చంద్రహాస్ ఎంటర్‌ప్రైజెస్ ఏడాదికి రూ1.53కోట్లతో టెండర్ దక్కించుకుంది. ఏడాదికి 5 శాతం పెంచుకుంటూ 33 సంవత్సరాల పాటు హోటల్‌ను నిర్వహించుకోవచ్చని చెప్పింది. కారణాలేమోగాని వారు ముందుకు రాలేదు. ఆతర్వాత అద్దె ధర తగ్గించుకుంటూ ఏడాదికి రూ.కోటి అద్దెకు కుదించి 2023లో టెండరు పిలిచారు. పలుచోట్ల రిసార్ట్సు, హోటల్స్ కలిగిన మృగవాణి సంస్థ చేజిక్కించుకుంది.

ప్రైవేట్ పరంపై విమర్శలు

అలిపిరి సమీపంలోని విశాలమైన స్థలంలో హరిత హోటల్ కోసం నిర్మించిన 5 అంతస్థుల భవనంలో 103 గదులు, 200 మంది కూర్చునేలా రెస్టారెంట్, 3 కాన్ఫరెన్స్ హాళ్లు, ఒక ఫంక్షన్ హాల్, డార్మిటరీ అకామడేషన్, 100 కార్లు నిలిపే సదుపాయాలున్నాయి. అత్యంత ప్రాధాన్యత కలిగిన అలిపిరి సమీపంలో నెలకు రూ8.3లక్షల అద్దెకోసం ఐదంతస్థుల విశాలమైన భవనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో తిరుచానూరు సమీపంలో టీటీడీ నిర్మించిన పద్మావతి నిలయాన్ని (ప్రస్తుత కలెక్టరేట్) ఏపీటీడీసీ ఏడాదికి కోటి రూపాయల అద్దెతో తీసుకుంది. అదే టూరిజం విభాగం తనకున్న భవనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అదే అద్దెకు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. ఇదిలా ఉంటే వైసీపీ హయాంలో దక్కించుకున్న టెండరు కాలపరిమితి ముగిసిన తర్వాత పనులు మొదలు పెట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

రుయాలో గుండె పోటుతో వైద్యుడి మృతి



డాక్టర్ నరేంద్ర (ఫైల్ ఫొటో)

తిరుపతి(వైద్యం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వార్డులో రోగులను పరీక్షించిన వైద్యుడు.. బయటకు వస్తూనే కుప్పకూలారు. గుండె పోటుకు గురై మృతిచెందారు. ఈ విషాద ఘటన తిరుపతిలోని రుయాస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేంద్ర(55) సోమవారం మధ్యాహ్నం వరకు వార్డులో పలువురు రోగులను పరీక్షించారు. మరో వార్డులో రోగులను పరీక్షించేందుకు వెళుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆస్పత్రి ఆవరణలోనే కుప్పకూలారు. వెంటనే వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆయన్ను పక్కనే ఉన్న అత్యవసర విభాగానికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. ఇటీవలనే నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బదిలీపై రుయాస్పత్రికి వచ్చారు. ఆయన మృతికి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధతో పాటు పలువురు వైద్య విభాగాధిపతులు సంతాపం తెలిపారు.

'స్కిట్'కు పునరుజ్జీవం

- ఇంజనీరింగ్ అడ్మిషన్ల వెబ్‌సైట్‌లో కళాశాల పేరు
- ఈ ఏడాది నుంచే తరగతులు
- ఫలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)కి కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం నింపింది. సోమవారం ఎంసెట్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌లో స్కిట్ కళాశాలకు స్థానం కల్పించి అడ్మిషన్లకు ఆహ్వానం పలికారు. ఎన్నికల హామీలో భాగంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి ఫలించడంతో ఈ ఏడాది నుంచే ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

1997లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుసంధానంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను చేరువ చేయాలని భావించారు. ఆ మేరకు శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని ప్రారంభించారు. ఈ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. సీట్ల కోసం పెద్దఎత్తున సిఫార్సులు కూడా వచ్చేవి. గత వైసీపీ పాలనలో స్కిట్ కళాశాల పర్యవేక్షణలో విఫలమయ్యారు. దాంతో క్రమంగా విద్యార్థుల చేరిక తగ్గిపోయింది. 2021 డిసెంబరు నెలలో విద్యాసంవత్సరం మధ్యలోనే అర్థాంతరంగా కళాశాలను మూసేశారు. స్కిట్‌ను మూసివేయడం తగదంటూ విద్యార్థులు, యువత ఆందోళన వ్యక్తంచేసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ప్రజల అభీష్టం మేరకు గతేడాది ఎన్నికల సందర్భంగా స్కిట్ కళాశాలను పునఃప్రారంభిస్తామని చంద్రబాబు పాల్గొన్న బహిరంగ సభలో బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన సుధీర్‌రెడ్డి స్కిట్ కళాశాలను తిరిగి ప్రారంభించేందుకు పలుమార్లు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. మంత్రి చొరవతో స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూతో అనుసంధానం చేయడంపై ఉన్నతస్థాయి అధికారుల కమిటీని నియమించారు. నెల రోజుల కిందట ఈ ప్రక్రియ పూర్తయింది. కళాశాలలో తరగతి గదులు ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సోమవారం ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా స్కిట్ కళాశాలను పొందుపరిచారు. మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్(ఈఈఈ), ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), ఆర్టిఫిసియల్ ఇంటెలిజెంట్ అండ్ మిషన్ లెర్నింగ్(సీఎస్ఎం), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డేటా సైన్స్(సీఎఎస్‌డీ) బ్రాంచ్‌లను అందుబాటులో ఉంచారు. ఒక్కో బ్రాంచ్‌లో 66 సీట్లు కాగా, మొత్తం 396 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఏడాదికి రూ.70వేలు ఫీజును నిర్ణయించారు.





ఇంజనీరింగ్ అడ్మిషన్ల వెబ్‌సైట్‌లో స్కిట్ కళాశాల

ఆయిల్‌పామ్ కంపెనీకి మండలాల కేటాయింపు రద్దు

- కార్యకలాపాలు మొదలు పెట్టకపోవడమే కారణం

తిరుపతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్ పామ్ పంట అభివృద్ధి కోసం ఓ కంపెనీకి కేటాయించిన రెండు మండలాలను ప్రభుత్వం తాజాగా రద్దు చేసింది. ఆ కంపెనీ ఎలాంటి కార్యకలాపాలూ చేపట్టకపోవడమే దీనికి కారణం. ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించిన పూర్వాపరాలిలా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఆయిల్ పామ్) ప్రోగ్రామ్ కింద 2021-22 నుంచీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేపడుతోంది. 2021-22 నుంచీ 2025-26 వరకూ 1.12 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని లక్ష్యం నిర్దేశించింది. రాష్ట్రంలో 4 జిల్లాలకు చెందిన 24 మండలాలను ఎంపిక చేసింది. అందులో భాగంగా గతేడాది మార్చిలో తిరుపతి జిల్లాలో నాగలాపురం, నారాయణవనం మండలాలను మెస్సర్స్ ఏఎంఆర్ ఆగ్రో ఫార్మ్స్ లిమిటెడ్ అనే కంపెనీకి కేటాయించింది. ఈలోపు 2025-26 సంవత్సరానికి కేంద్రం అదనంగా మరో 50 వేల హెక్టార్ల లక్ష్యం విధించింది. అయితే 2025-26లో నారాయణవనం, నాగలాపురం మండలాల పరిధిలో ఏఎంఆర్ ఆగ్రో ఫార్మ్స్ లిమిటెడ్ సంస్థ ఆయిల్ పామ్ పంట అభివృద్ధి దిశగా చేసిందేమీ లేదని రాష్ట్ర హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ గుర్తించారు. ఈ విషయాన్ని ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ సంస్థకు రెండు మండలాల కేటాయింపును రద్దు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి మూడు రోజుల జైలు

- 15 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యంతాగి వాహనాలు నడిపిన కేసుల్లో ఆరుగురికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి కథనం మేరకు.. తిరుపతిలో ఐదారు నెలలుగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై తనిఖీలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన మందుబాబులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. వీరిలో ఆరుగురికి మూడు రోజుల జైలు శిక్ష.. మరో 15 మందికి రూ.10,000 వంతున రూ1.50 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రిజిస్ట్రేషన్‌తోనే ఆస్తి మీపేరిట

- 1నుంచి తిరుపతిలో ఆటో మ్యుటేషన్ అమలు

తిరుపతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఏదైనా స్థలం లేదా ఇల్లు కొనుగోలు చేసి, ఆ ఆస్తి మీపేరిట మార్చుకునేందుకు కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారా? రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానంలో ఈ సమస్య ఉండదు. రిజిస్ట్రేషన్ తర్వాత ఆస్తి వివరాలు, పన్నుల నమోదు.. ప్రాపర్టీ టాక్స్ రికార్డులో ఆటోమేటిక్‌గా చేరతాయి. డిజిటల్ డేటా ఆధారంగా పారదర్శకతతో కూడిన సేవలు అందుబాటులోకి వస్తాయి. పట్టణ ప్రాంతాల్లో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మ్యుటేషన్ చేయించుకోవడంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ 'అర్బన్ ఆటో మ్యుటేషన్' ప్రక్రియను ఆగస్టు 1నుంచి అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ విధానం వల్ల దాన విక్రయ, పరివర్తన, దస్తావేజుల రిజిస్ట్రేషన్ ద్వారా ఆస్తి పూర్తిస్థాయిలో బదలాయింపు అయిన వెంటనే కొనుగోలుదారు పేరిట మ్యుటేషన్ జరిగిపోతుంది. ఆస్తిపన్ను, యాజమాన్య వివరాలను ప్రాపర్టీట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబరు (పీటీఐఎన్) ఉపయోగించి సీడీఎంఏతో అనుసంధానం చేస్తారు. సాధారణంగా మున్సిపాల్టీలలో మ్యూటేషన్ ప్రక్రియ 15 నుంచి 30 రోజులు లేదా అంతకంటే ఎక్కువ రోజులు పడుతుంది. సీడీఎంఏ డేటా బేస్ నుంచి పీటీఐఎన్ ఉపయోగించి ఆస్తి వివరాలను నేరుగా పొందడం ద్వారా మ్యుటేషన్ సులభతరమవుతుంది. ఆటోమ్యుటేషన్ ఫీజు ఆస్తి విలువను బట్టి ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా లెక్కిస్తారు. తద్వారా మధ్యవర్తులతో సంబంధంలేకుండా పోతుంది. ఆస్తివివరాలు, పన్ను బకాయిలు, యాజయాన్య రికార్డులు ఖచ్చితంగా ఉంటాయి. తప్పు డోరు నెంబరు వంటి లోపాలను కూడా గుర్తిస్తుంది. తప్పు రికార్డుల వల్ల జరిగే వివాదాలను తగ్గిస్తుంది. ఎస్ఎంఎస్ నోటిఫికేషన్లు, ఆన్‌లైన్ స్టేటస్ ట్రాకింగ్ వంటి సదుపాయాల ద్వారా దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు వివరాలను అందిస్తుంది.

పల్లెల్లో 'స్వచ్ఛ రథం'

- ప్రయోగాత్మకంగా తిరుపతి రూరల్‌లో రెండు పంచాయతీల ఎంపిక
- వచ్చే నెల 15నుంచి అమలుకు శ్రీకారం



గుంటూరులో అమలవుతున్న స్వచ్ఛరథం

తిరుపతిరూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చెత్తపై పన్ను వేస్తే.. కూటమి ప్రభుత్వం పొడి చెత్తకు సరుకులిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తడి, పొడి చెత్తలని వేరుచేయడం క్లిష్టతరంగా మారిన తరుణంలో గ్రామాల్లో శుభ్రతతోపాటు ప్రజలకు ఆదాయమూ సమకూరేలా పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ రథం' కార్యక్రమం చేపట్టింది. ప్రయోగాత్మకంగా తిరుపతి రూరల్ మండలంలోని రెండు పంచాయతీల్లో ఆగస్టు 15 నుంచి అమలు చేయనుంది. ఇప్పటికే గుంటూరుజిల్లాలోని రూరల్‌మండలంలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేశారు. ఇది విజయవంతం కావడంతో ఇక్కడా అమలుకు చర్యలు చేపట్టారు.

ఎండీయూ వాహనాల వినియోగం

స్వచ్ఛ రథం కోసం మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) వాహనాలను వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. సాధారణంగా గ్రామాల్లో కొందరు పాతసామాన్లకు ఉల్లిపాయలు, బెల్లం వంటి వస్తువులను ఇస్తామంటూ ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తిరిగి సేకరిస్తుంటారు. దీన్ని ఒక సిస్టమాటిక్‌గా ప్రభుత్వమే చేపట్టనుంది. ప్రతిఫలంగా వారికి పొడిచెత్త బరువును బట్టి సరుకులు ఇస్తే బాగుంటుందన్న సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి చేపట్టింది. ఇందులో భాగంగా స్వచ్ఛరథం వాహనాలు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలనుంచి రీసైక్లింగ్ వ్యర్థాలను (ప్లాస్టిక్ బాటిళ్లు, నీళ్లబాటిళ్లు, బ్యాగులు, అట్టపెట్టెలు తదితరాలు) సేకరించి.. దానికి ప్రత్యామ్నాయంగా వారికి ఇంటికి వాడుకునే నిత్యావసరాలను (వేరుశనగ, కందిపప్పు, కొబ్బరి నూనె, సేమియా, ఉల్లిపాయలు, టీపొడి, సోపులు తదితరాలు) అందించనున్నారు. ఇంటి వద్దకే వచ్చి ప్రజల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను తూకంవేసి రేటు నిర్ణయిస్తారు. దాని ప్రకారం నిత్యావసర సరుకులను తీసుకోవచ్చు.



పాత సామాన్లు తీసుకుని నిత్యావసర సరుకులు ఇస్తున్న నిర్వాహకులు

రెండు వాహనాలను సిద్ధం చేస్తున్నాం

మండలంలోని రెండు పంచాయతీల్లో ఆగస్టు 15 నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి రెండు ఎండీయూ వాహనాలను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే పెరుమాళ్లపల్లె పంచాయతీని ఎంపిక చేశాం. ఉన్నతాధికారులతో మాట్లాడి మరొకటి ఎంపిక చేస్తాం. ఈ వాహనాలు గ్రామాలకు వెళ్లి పునరుద్ధరించే పొడిచెత్తని సేకరించి నిత్యావసర సరుకులు అందించనున్నారు. దీనివల్ల గ్రామాల పరిశుభ్రతతోపాటు ఎండీయూ వాహనాల యజమానులకు ఉపాధీ లభించనుంది.

- కె.దయాసాగర్, డిప్యూటీ ఎంపీడీవో




గోపిచంద్ మలినేని - శివరాజ్ కుమార్

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం సినీ దర్శకుడు గోపిచంద్ మలినేని, కన్నడ నటుడు శివరాజ్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఐటీసీటీఏ పురస్కారం అందుకుంటున్న జిల్లా టూరిజం ఆర్డీ రమణప్రసాద్

ఏపీ టూరిజానికి ప్రతిష్ఠాత్మక అవార్డు

ఇంటర్నేషనల్ టూరిజం కాన్‌క్లేవ్ అండ్ ట్రావెల్ (ఐటీసీటీఏ) సంస్థ ఏపీలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులు, ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలించింది. 'ఎమర్జింగ్ కోస్టల్ అండ్ హెరిటేజ్ అవార్డును' ప్రకటించింది. ఈ అవార్డును శనివారం ఢిల్లీలో ఆ సంస్థ ప్రతినిధుల నుంచి జిల్లా పర్యాటకశాఖ ఆర్‌డీ రమణ ప్రసాద్ అందుకున్నారు. కొన్ని కారణాలతో పర్యాటకఅభివృద్ధి కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి వెళ్లకపోవడంతో తిరుపతి ఆర్డీ రమణ ప్రసాద్ అందుకున్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 85,486

తలనీలాలు సమర్పించినవారు: 30,929



వాకాడు డిపో నమూనాను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ

బస్టాండ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం

● ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

వాకాడు/వెంకటగిరి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల కోసం కుర్చీలు, ఫ్యాన్‌ల ఏర్పాటుతో సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు తెలిపారు. వాకాడు, వెంకటగిరిలోని డిపోలు, బస్టాండ్లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వాకాడు డిపో ఆవరణంలో మొక్కలను నాటారు. రెండు చోట్లా డిపో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. మీడియాతో మాట్లాడారు. బస్టాండ్లకు కొత్తగా రంగులు వేస్తున్నామని తెలిపారు. వాకాడు డిపో ఆవరణలో సిమెంట్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయనున్నామన్నారు. అన్ని డిపోల్లో బస్సు సర్వీసులు ఎలా ఉన్నాయో జోన్ల వారీగా తెలుసుకుని కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో వెంకటగిరి, వాకాడు డిపోలను పరిశీలించి సర్వీసులు, సిబ్బందికి సూచనలు అందించామన్నారు. వెంకటగిరిలో మరో రెండు ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేసి అత్యాధునిక బస్టాండ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆర్టీసీ ఎండీ వెంట ఈడీ చంద్రశేఖర్, ఈడీఈ చెంగల్‌రెడ్డి, ఈడీవో అప్పలరాజు, వెంకటగిరి, వాకాడు డీఎంలు రామకృష్ణ, పెంచలయ్య, సిబ్బంది ఉన్నారు.

పులి..జాడ ఎక్కడ?

- శేషాచల అడవుల్లో అంతరిస్తున్న వైనం
- ఎస్వీ జూకే పరిమితం
- నేడు జాతీయ పులుల దినోత్సవం





జూపార్కులో తెల్ల పులి



జూపార్కులో రాయల్‌బెంగాల్ టైగర్

దేశంలో పులుల సంఖ్య

సంవత్సరం	పులుల సంఖ్య
2006	1,411,
2010	1,726
2014	2,226
2018	2,927
2022	3,682 (అంచనా)

మంగళం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పెద్దపులి.. వేటలో రారాజు.. రాజసానికి ప్రతీక. దీనిపేరు వింటేనే జనానికి ముచ్చెమటలు పడతాయి. కదలికలో చురుకుదనం, చూపులో తీక్షణం, గాండ్రింపులో వైవిధ్యమున్న ఈ మృగం ఉనికి నానాటికీ అంతరించిపోతోంది. అభయారణ్యంగా పేరొందిన మన శేషాచల అటవీప్రాంతంలో వ్యాఘ్రం మచ్చుకైనా లేదంటే ఆశ్చర్యం,ఆవేదన కలుగుతాయి. ఇప్పుడు పులులు ఎస్వీ జూకు మాత్రమే పరిమితమయ్యాయి.

చాన్నాళ్లుగా ఉనికే లేదు..

దట్టమైన అడవి పెద్దపులులకు ఆవాసానికి అనుకూలం. అడవుల పరిరక్షణలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. శేషాచల పరిధిలోని ఆహార వనరులు, రాతి గుహలు, సెలయేళ్లు, నీటి గుంటలు పులుల మనుగడకు ఉపకరించేవి. ఈ దృష్ట్యా ప్రభుత్వం ఏడాది క్రితం నల్లమల నుంచి బద్వేల్ మీదుగా శేషాచలం వరకు ప్రత్యేక కారిడార్‌గా ప్రకటించింది. నాలుగు జిల్లాల్లో నాలుగు లక్షల హెక్టార్ల పరిధిలో విస్తరించిన ఈ కారిడార్‌లో చాన్నాళ్లుగా పులి సంచరించిన దాఖలాలు లేవని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఆరేళ్ల క్రితం చామల రేంజ్ అటవీప్రాంతంలో ఓ పెద్దపులిని గుర్తించినా తర్వాత ఉనికి లేదు. తాజాగా నెల్లూరు, కడప జిల్లాల మధ్య పులుల కార్యకలాపాలున్నట్లు భావించినా నిర్ధారణ కాలేదు. నాగార్జునసాగర్-శ్రీశైలం రిజర్వు ఫారెస్ట్‌లో 95 పెద్దపులులున్నాయని అంచనా.



పెద్దపులులు

జూపార్కులో పులుల సందడి

అంతరించిపోతున్న పెద్దపులు పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తిరుపతి ఎస్వీ జూపార్కులో రెండు బెంగాల్ టైగర్స్, తొమ్మిది తెల్లపులులు సందర్శకులు కనువిందు చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం తీసుకువచ్చిన నాలుగు పిల్లల్లో రెండు చనిపోయాయి. ఇక్కడి పులులకు రోజూ అర లీటరు పాలు, ఐదు నుంచి 6కిలోల బీఫ్, రెండు కేజీల చికెన్,రెండు కోడిగుడ్లు వంతున ఆహారంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.4,85,4590 ఖర్చవుతుంది. ఈక్రమంలోనే పులులను దత్తత తీసుకుని ఆహారానికి కొంత ఆర్థిక సాయం సమకూర్చాలని జంతు ప్రేమికులకు జూ అధికారులు కోరుతున్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి

పరిష్కారం కాని పక్షంలో వివరణ ఇవ్వండి ● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం ● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 260 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో దానికి కారణాలు తెలుపుతూ వివరణ ఇవ్వాలని జిల్లా అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి వినతులు సమర్పించారు. కొన్ని అర్జీలకు అక్కడికక్కడే వర్చువల్ విధానంలో కలెక్టర్ పరిష్కారం చూపారు. వివిధ సమస్యలపై మొత్తం 260 అర్జీలు రాగా, అందులో రెవెన్యూ శాఖకు 125 ఉన్నాయి.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

పింఛను కోసం మూడేళ్లుగా తిరుగుతున్నా..



నేను మూడేళ్ల క్రితం మానసిక వైకల్యానికి గురయ్యాను. ప్రభుత్వ వైద్యాధికారులు ధ్రువపత్రం కూడా ఇచ్చారు. మూడేళ్లుగా వికలత్వ పింఛను కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతూనే ఉన్నాం. అధికారులు పట్టించుకోవడంలేదు. భార్యతో పాటు ఇద్దరు పిల్లలను పోషించడం కష్టంగా ఉంది. పింఛను మంజూరు చేసి ఆదుకోండి.

- గంగయ్య, టీకేపురం, పిచ్చాటూరు మండలం

గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించండి



నా భర్తకు అనారోగ్యం. నాకు క్యాన్సర్ కారణంగా కాలు తొలగించారు. మా అమ్మాయి పదవ తరగతిలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ సీటు ఇప్పించండి.

- లక్ష్మి, నాగనందవరం, వరదయ్యపాళెం మండలం

చెరకు రైతుల బకాయిలు చెల్లించండి

మయూర షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు రైతులకు ఆరేళ్లుగా బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రూ.16కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని, షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులు జప్తుచేసి వీలైనంత త్వరగా చెల్లించాలని రైతులతో కలిసి కలెక్టర్‌ను కోరారు.

రోడ్డు ఏర్పాటు చేయండి



మా గ్రామంలో 180 కుటుంబాలున్నాయి. జాతీయ రహదారి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. 50 ఏళ్లుగా డొంక రోడ్డులో ప్రయాణం చేస్తున్నాం. వర్షాకాలం వచ్చిందంటే అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రెండు కిలోమీటర్లు తారు రోడ్డు వేశారు. రిజర్వు ఫారెస్టు ఉన్న రెండు కిలోమీటర్లు అలాగే వదిలేశారు. పలుమార్లు అర్జీలు సమర్పించినా పట్టించుకోవడం లేదు. అత్యవసర సమయాల్లో చాలా ఇబ్బంది పడుతున్నామని, రోడ్డు ఏర్పాటు చేయాలని డక్కిలి మండలానికి చెందిన వీకేపై సముద్రం గ్రామ ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.

మా బడి మాకు కావాలి

'మా బడి మాకు కావాలి' అంటూ నారాయణవనం మండడలం తుంబూరు హరిజనవాడకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. తమ గ్రామంలో 56 మంది విద్యార్థులు ఉండగా పక్క గ్రామంలోని 11మంది విద్యార్థులతో కూడిన పాఠశాలతో విలీనం చేయడం దుర్మార్గమన్నారు. విద్యా సంవత్సరం మొదలై 3 నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. వీరికి ఏఐఎస్ఎఫ్ నేతలు శివారెడ్డి, ఉదయ్, ప్రవీణ్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు.



తుంబూరు హరిజనవాడవాసుల ధర్నా



పల్లంపేటవాసుల ఆందోళన

మా ఊరిలో 60 మంది పిల్లలు చదువుతున్నారు. వారిని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లం హరిజనవాడ పాఠశాలలో ఎలా విలీనం చేస్తారంటూ ఏర్పేడు మండలం పల్లంపేట వాసులు ప్రశ్నించారు. ఈ మేరకు తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. పిల్లలు జాతీయ రహదారిపై నడచివెళ్లడం ప్రమాదకరమని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల విలీనం ఆలోచనను రద్దు చేయాలని కోరారు.

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం

- అధికారులకు ఎస్పీ ఆదేశం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతులకు నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ హర్షవర్ధనరాజు అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు హాజరైన ప్రజల సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఇందులో 10 ఏళ్ల నాటి సమస్య ఒక్క రోజులో పరిష్కారం కావడంతో అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు. మిగిలిన వినతులను ఆయా స్టేషన్లకు పంపారు. దాదాపు 100 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రవిమనోహరాచారి, సీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రంగనాయక మండపంలో వెంకయ్యనాయుడికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అదనపు ఈవో

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన వెంకయ్య నాయుడు ధ్వజస్తంభానికి, తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ, కుటుంబ సమేతంగా భగవత్ దర్శనం చేసుకోవడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. హిందూ ధర్మం ప్రకారం దైవభక్తి ఉండటంతో పాటు సమాజ భక్తి, సేవ, అనురక్తి కూడా కలిగి ఉండాలని సూచించారు.

విధి నిర్వహణలో ఉన్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉండగానే రైల్వే హెడ్ కానిస్టేబుల్ కళ్ళు తిరిగి కింద పడి మృతి చెందారు. ఈ ఘటన సోమవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫారంలో చోటుచేసుకుంది. రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. తిరుపతి జీఆర్‌పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వై.ఎరికలరెడ్డిది కడప జిల్లా తొండూరు మండలం ఇనగనూరు గ్రామం. ఈయన ఏడేళ్లుగా రైల్వే విభాగంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఒకటో ప్లాట్‌ఫారంలో విధి నిర్వహణలో వుండగా నీళ్ళు తాగడం కోసం రైల్వే స్టేషన్ వద్దకు వచ్చే క్రమంలో కళ్లు తిరిగి కింద పడ్డారు. అక్కడున్న పోలీసులు చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే సీఐ ఆశీర్వాదం చెప్పారు.

నన్ను టార్గెట్ చేసి నిర్బంధించారు

● వైల్డ్‌లైఫ్ అండ్ మాక్రో ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ



తిరుపతి(జీవకోన), జూలై 28(ఆంధ్రజ్యోతి): శేషాచల అడవుల్లోని ప్రకృతి అందాలను బాహ్యప్రపంచానికి వెబ్ పేజీ ద్వారా చూపుతున్న తనను టార్గెట్ చేసి పుత్తూరు అటవీశాఖ కార్యాలయంలో అక్రమంగా నిర్బంధించారని వైల్డ్‌లైఫ్ అండ్ మాక్రో ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీశాఖ నిబంధనల ప్రకారం సదాశివకోన, జలపాతాలను, దేవాలయాలను సందర్శించాలని 20 మంది స్నేహితులతో కలిసి అటవీశాఖ టిక్కెట్లను కొని ఆదివారం వెళ్లామన్నారు. తిరుగు ప్రయాణంలో తమకు అనుమతిచ్చింది ఈ ప్రదేశం వరకే అంటూ పుత్తూరు అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి రాత్రంతా గదిలో పెట్టి తాళంవేశారన్నారు. తాను చేసిన తప్పేంటని ప్రశ్నించినా పొంతనలేని సమాధానం చెప్పారన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు ప్రాంతంలో తమ వద్ద హామీ పత్రాన్ని రాయించుకుని వదిలి పెట్టారన్నారు. తనను అరెస్టు చేసినట్లు, అపరాధ రుసుం కట్టించుకున్నారని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ చెప్పినట్లుగా సామాజిక మాధ్యమంలో చూశానన్నారు. దివ్యారామంలో చెట్లు నరికిన అంశంపై తాను చేసిన వీడియో అప్పట్లో వైరల్‌గా మారడంతోనే ఇలా కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. 9 ఏళ్లగా ప్రకృతి అందాలను చిత్రీకరించి బాహ్య ప్రపంచానికి చూపుతున్న తనకు, ఒక రాత్రిలో పరువు పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదేమి ట్రెండ్!



ఒకప్పుడు సమాజాన్ని ప్రభావితం చేసిన నేతల బొమ్మలతో యువత టీ షర్టులు వేసుకునేవారు. ఆ తర్వాత కొటేషన్లు.. క్రమేణా తమ అభిమాన సినీ హీరోలు, రాజకీయ నేతల చిత్రాలతో టీ షర్టులు ధరిస్తూ వచ్చారు. ఇలా తమ అభిమానం చూపుకొనే వారు. మరిప్పుడు గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ ఫొటోతో కూడిన టీ షర్టులు ధరిస్తుండటం జనాన్ని విస్మయానికి గురిచేస్తోంది. ఇలా.. సోమవారం తడలోని శివాలయానికి ఓ భక్తుడు వీరప్పన్ ఫొటోతో ఉన్న టీషర్టు వేసుకుని రావడంతో 'ఇదేమి ట్రెండ్' అంటూ చర్చనీయాంశంగా మారింది. ఈ టీషర్టు రూ.300 అని, చెన్నైలో వీటికి మంచి డిమాండ్ ఉందంటూ ఆ యువకుడు చెప్పడం గమనార్హం.

- తడ, ఆంధ్రజ్యోతి

షార్‌లో పలు ప్రాజెక్టులు ప్రారంభం

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో రూ.486.22 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న పలు ప్రాజెక్టులను సోమవారం ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రారంభించారు. సాలిడ్ ప్రొపెల్లెంట్ ప్లాంట్ అగ్మెంటేషన్ (ఎస్‌పీఏజీ), 10 టన్నుల మిక్సర్ ప్లాంట్, కెమికల్ టెస్టింగ్ ల్యాబ్, విద్యుత్ ఉపకేంద్రం, ఆధునికీకరించిన పరిపాలన భవన సముదాయాలను ప్రారంభించారు. సూళ్లూరుపేట సమీపంలోని షార్ ఉద్యోగుల కాలనీలో నూతనంగా నిర్మించనున్న క్వార్టర్స్ భవనాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15 వేల మందికి బియ్యం పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 26 నుంచి 30 వరకు దివ్యాంగులకు, వృద్ధులకు ఇళ్ల వద్దకు తీసుకెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్నారు. 61,251 మందికిగాను ఈ నెలలో మూడు రోజులుగా 15 వేల మందికి బియ్యం పంపిణీ చేసినట్లు డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నీటి మడుగుల్లా అప్రోచ్ రోడ్లు



అక్కంపేట జాతీయ రహదారి పడమర వైపు గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీరు

తడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రోడ్లను బాగు చేస్తుంటే... జాతీయ రహదారి అప్రోచ్ రోడ్లకు మాత్రం గ్రహణం వీడటం లేదు. కొన్ని రోడ్లు మురుగునీటితో నిండిపోయి ఉంటున్నాయి. వాహనదారులు, పాదచారులు, ఇబ్బందులు పడుతున్నా సదరు అధికారులకు పట్టడం లేదు. అక్కంపేట, జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రద్దగుంట, కాశీంగాడుకండ్రిగ గ్రామాలకు అప్రోచ్‌రోడ్ల మీదుగా వెళ్లాల్సి ఉంది. కానీ ఆ రోడ్లు గుంతలు పడి ఇబ్బందికరంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. రెండు రోజుల క్రితం భారీ వర్షం కురవడంతో అప్రోచ్‌రోడ్లు నీటి మడుగుల్లా మారాయి. అధికారులు స్పందించి కాస్త మట్టివేస్తే రాకపోకలకు అవకాశం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

మహిళా రైతుకు సబ్సిడీపై డ్రోన్ అందజేత

చిల్లకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆధునిక పరికరాలను అందజేస్తూ వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం బల్లవోలు గ్రామానికి చెందిన మహిళా రైతు చెరుకూరు పద్మజకు సబ్సిడీపై డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10లక్షల విలువ చేసే డ్రోన్‌ను రూ.8 లక్షల రాయితీతో రూ.2 లక్షలకే రైతులకు అందిస్తున్నామన్నారు. డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పురుగు మందులను పిచికారి చేసుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ గోపినాయక్, ఏవో భవానీ, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

కోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహం విద్యార్థినులను బెత్తంతో కొట్టి గుంజిళ్లు తీయించిన వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్‌తో పాటు హెచ్‌ఎంపైనా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఎస్సీ బాలికల హాస్టల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. మొదటగా బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులను విచారించారు. విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు పైశాచికంగా కొడుతుంటే మిగతా ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అక్కడ నుంచివసతి గృహానికి వెళ్లి వార్డెన్ ఉషాను విచారించారు. ఆయన వెంట వైపీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, నాయకులు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, పాముల సురేంద్ర, షనీల్‌రెడ్డి, విజయల్‌రెడ్డి, వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



సీనియర్ అసిస్టెంట్ నాగమణికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

వెంకటగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతార రాధాకృష్ణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ఉన్న రూ.1200 కోట్లు దారి మళ్లించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయింలకు నిధులు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులు పోస్టుకార్డుల ద్వారా తమ సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వరుణ్ కుమార్, రామకృష్ణ, తిరుమల, వెంకటేష్, కల్లూరు జాన్, నరసింహులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యతని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విక్టోరియారాణి అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని విద్యార్థులకు తెలియజేశారు. ప్రస్తుతం అనేక కారణాలతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని, దీని వల్ల ప్రకృతి విపత్తులు సంభవించి ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు ప్రకృతి పరిరక్షణ యువత బాధ్యత అనే అంశంపై వక్తృత్వ వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం కూల్చివేతపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం పుదూరులో ఆరు దశాబ్దాల నాటి గాంధీ విగ్రహం స్వల్పంగా శిథిలావస్థకు చేరడంతో పగలగొట్టి.. శ్మశానంలో భవన నిర్మాణ శిథిలాల వద్ద పడేసిన విషయం తెలిసిందే. దీనిపై పుదూరు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు.

పాఠశాలల స్థలాలను సర్వే చేయించుకోండి

తడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల స్థలాలను సర్వే చేయించుకోవాలని తహసీల్దారు శరత్‌బాబు విద్యాశాఖ అధికారులకు సూచించారు. సోమవారం తహసీల్దారు శరత్‌బాబును ఎంఈవో మల్లికార్జునరావు కలిశారు. మాంబట్టు, పూడిలో స్థల వివాదాలు పరిష్కారమయ్యాయని తెలిపారు. తహసీల్దారు మాట్లాడుతూ కొందరు పాఠశాలల స్థలాలు తమవంటూ న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని, ఆయా పాఠశాలల రికార్డులను సంబంధిత ప్రధానోపాధ్యాయులు భద్రపరు చుకోవాలని, అవసరమైతే రెవెన్యూ సిబ్బంది సహాయం తీసుకోవాలని సూచించారు.

రైల్లో నుంచి పడి యువకుడి మృతి

దొరవారిసత్రం, జూలై 28(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం శాలిమర్ నుంచి చెన్నై వెళ్లే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి నవీన్ ఉపాధ్యాయ(34) అనే యువకుడు దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాల కోసం సూళ్లూరుపేట జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న యువతి మృతదేహం అప్పగింత

తడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న యువతి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పూజిత (22) తడలో నివాసం ఉంటూ అపోలో టైర్ల పరిశ్రమలో పనిచేస్తుండేది. ఆదివారం రాత్రి ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. ఇందుకు ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూజిత మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హామీలన్నీ నెరవేర్చాకే ఓట్లడుగుతాం: విజయశ్రీ



అర్లపాడు గిరిజన కాలనీలో దివ్యాంగులకు పింఛను రాలేదని చెప్పడంతో వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల

పెళ్లకూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాకే ఓట్లు అడగడానికి వస్తామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెన్నప్పనాయుడుపేట, చెంబేడు, అర్లపాడు, పునబాక గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆమె భర్త పార్థసారధి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పర్యటించారు. ఇంటింటికీకి వెళ్లి కరపత్రాలను అందజేసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 14 గ్రామాలకు సాగు, తాగునీటికి ఉపయోగపడే చెంబేడు చెరువును మినీ రిజర్వార్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు పంపామని, ఆర్థికశాఖ నుంచి అనుమతి రాగానే బడ్జెట్‌లో ఆమోదింప చేస్తామని తెలిపారు. చెన్నప్పనాయుడుపేట రైతుల విజ్ఞప్తి మేరకు చెంబేడు చెరువు నుంచి మూడు కిలోమీటర్ల పంట కాలువ పూడికతీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే అర్లపాడు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఏడు పదుల వయస్సులో కూడా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడుతున్న సీఎం చంద్రబాబుకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు ప్రసాద్ నాయుడు, రమేష్ నాయుడు, శివకుమార్, సుబ్బరామయ్య, నరేంద్ర యాదవ్, భాను, మల్లిరెడ్డి, హరినాయుడు, యుగంధర్, పోలయ్య, మురళీకృష్ణారెడ్డి, మల్లిరెడ్డి మునివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం: కురుగొండ్ల



కోటంబేడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని కోటంబేడు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. తెలుగంగ కాలువ నుంచి చెరువులకు నీరు అందించాలని రైతులు కోరడంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయడం జరిగిందని, విద్యుత్ కనెక్షన్ ఇచ్చి చెరువులకు నీరు విడుదల చేస్తామని చెప్పారు. పొలాల్లోకి వెళ్లేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి పథకం కింద ఏర్పాటు చేసిన రోడ్డు అధ్వానంగా తయారైందని, నూతనంగా రోడ్డు నిర్మించాలని రైతులు కోరడంతో వెంటనే రూ.ఐదు లక్షలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వేళ్ల సురేంద్ర రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నాయకులు రాయి సత్యంనాయుడు, కూను శ్రీహరి, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, ముప్పాళ్ల గురువేంద్ర, నల్లబోతుల మురళి, చిత్తూరు ఈశ్వరయ్య, మల్లెమాల గోపికృష్ణారెడ్డి, నీసీ నాయుడు, దాసరి కోటేశ్వరావు, కొమ్మి గెరటయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.





కామాక్షీదేవి ఆలయానికి తాళాలు వేసిన్న దృశ్యం - ధాన్యం, పొట్టులో అమ్మవారు, కలశ చెంబు

కామాక్షీదేవి ఆలయం మూత
అమ్మవారి విగ్రహం కింద 107 ఏళ్లనాటి నాణేలు

కోట, జూలై 28(ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలోని కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయాన్ని సోమవారం మూసివేశారు. అమ్మవారికి స్థాన చలనం కల్పించి విగ్రహాన్ని, ఆయుష్కు సంబంధించిన కలశ చెంబులను సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భద్రపరిచారు. కుంభాభిషేకాలు నిర్వహించిన అనంతరం అదేస్థానంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని, ఇందులో భాగంగా ఆగస్టు 13 వరకు ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తామని ప్రధానార్చకుడు కార్తీక్‌శర్మ తెలిపారు. ఇదిలా ఉండగా అమ్మవారి విగ్రహాన్ని పెకిలించే సమయంలో తాళమట్టంలో 1918 నాటికి చెందిన నాలుగు నాణేలు లభ్యమయ్యాయి. వేదమంత్రోచ్చారణల నడుమ ఆ నాణేలను, అమ్మవారి విగ్రహాన్ని ఆలయ ఈవో శశ్యాంక్ ఆధ్వర్యంలో భద్రపరిచారు.



ఆలయ తాళమట్టంలో బయటపడిన నాణేలు

మందు బాబులను పట్టించిన డ్రోన్



మన్నారులో లేఅవుట్‌లో మద్యం తాగుతున్న మందు బాబులు

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పోలీసులు డ్రోన్ సాయంతో మందుబాబుల ఆటకట్టిస్తున్నారు. మన్నారు పోలూరులోని ఓ లేఅవుట్‌లో బహిరంగంగా మద్యం తాగుతున్న ఇద్దరిని డ్రోన్ సాయంతో గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌తో నిఘా పెట్టామని, ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ నేత మస్తానయ్య మృతి



మస్తానయ్య(ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మన్నారు పోలూరు నూకలపాలెం గ్రామానికి చెందిన గోచి మస్తానయ్య (71) సోమవారం మృతి చెందాడు. ఆయన మృత దేహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు మురళి, చిలకల శ్రీనివాసులు, లక్ష్మయ్య, ఉచ్చూరు రఘు, సాయి, కాంగ్రెస్ నాయకులు ఎం.వెంకటాచలపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేత్ర దానం

మస్తానయ్య నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయకు నేత్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వైజేపీ లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

గూడూరు అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వైజేపీ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో వైజేపీ లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఉపేంద్ర మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో విద్య, వైద్య రంగంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలకు చేయూతనందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గోపాల్‌కృష్ణ, శ్రీనివాస్, గౌతమ్, ఆర్‌వీరావు, గురునాధం, రూపేష్‌రెడ్డి, రవిచంద్రరెడ్డి, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వైజేపీ లయన్స్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 24 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.19.66 లక్షల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, మట్టం శ్రావణి, కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం పరిశీలన
హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రమణకు గురైన డేగలపాలెం శ్మశాన స్థలాన్ని సోమవారం తహసీల్దారు గోపినాథరెడ్డి పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో 'దాతలిచ్చిన స్థలాన్నీ వదల్లేదు.. రూ.కోటి విలువ చేసే శ్మశాన భూమి ఆక్రమణ' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు, రెవెన్యూ సిబ్బందితో శ్మశాన స్థలం వద్దకు వెళ్లి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 123-1లో ఉన్న పది సెంట్ల భూమి డేగలపాలెం శ్మశానికి సంబందించిందని, ఎవరు ఆక్రమించిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు.

పొంగిన మురుగు



ఆర్టీసీ బస్టాండు వద్ద పొంగి రోడ్డుపైకి చేరిన మురుగునీరు

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు వద్ద మురుగు కాలువలో చెత్తచెదారాలు పేరుకుపోవడంతో మురుగునీరు పొంగి రోడ్డుపైకి ప్రవహించింది. బస్టాండు, ఆర్‌అండ్‌బీ బంగ్లాకు మధ్యలో ఉన్న మురుగుకాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగునీరు పారుదల లేకపోవడంతో పొంగి రోడ్డు పైకి ప్రవహించడంతో ఆటువైపు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ అధికారులు స్పదించి మురుగు పొంగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై దృష్టి సారించండి

వెంకటగిరి టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ప్రభుత్వ భూము లు, కాలువలు, అన్యాక్రాంతం అవుతున్నాయని బీజేపీ మాజీ కన్వీనర్ టీటీ మణి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూముల రికార్డులు మార్చి ఆక్రమించుకుంటున్నారని, ఇదంతా రాజకీయ నాయకుల కనుసన్నల్లో జరుగుతోందన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు

డక్కిలి, జులై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు అన్యాక్రాతం కాకుండా చర్యలు తీసుకొంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావిజ్ఞప్తుల దినంలో ఎక్కువగా భూ సమస్యలపైనే అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. మండలంలో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుండడంతో కఠినంగా వ్యవహరిస్తూ ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. లింగసముద్రంలో దారిని ఆక్రమించి గడ్డి వామి ఏర్పాటు చేయడంతో వెంటనే దాన్ని తొలిగించాలని, లేదంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకా పాత నాలపాడు గ్రామంలో కొందరు రాత్రికిరాత్రే ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిమ్మ మొక్కలు నాటడంతో వాటిని తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైన ప్రభుత్వ భూములు ఆక్రమించాలని చూస్తే ఊరుకోనేది హెచ్చరించారు. భూ సమస్యలపై కార్యాలయానికి వచ్చే బాధితులను తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అలాగే మండలంలో నెలకొన్న వివిధ భూ సమస్యలను మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయండి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పీఏసీఎస్ చైర్మన్‌గా అల్లూరు కరుణాకర్‌రెడ్డి, సభ్యులుగా దువ్వూరు రవీంద్రరెడ్డి, బచ్చల రవీంద్రరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీ పాలకవర్గం పార్టీలకు అతీతంగా రైతులందరికీ రైతులకు రుణాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్ కుమార్, సోమిశెట్టి చెంచురామయ్య, మట్టం శ్రావణి, పేటేటి చంద్రనీల్, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, అమరయ్య, పెంచలయ్య, సురేంద్ర వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయండి



సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నేతలు

గూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ 14 ఏళ్లుగా పట్టణంలో ఫ్లైవర్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. దీంతో ఒకటో, రెండో పట్టణానికి రాకపోకలు సాగించాలంటే ప్రజలు అవస్థలు పడాల్సివస్తోందన్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన ఫ్లైవర్‌ను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివశంకర్, కిరణ్, నవీన్, మహేష్, ప్రసాద్, చైతన్య, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను పరిరక్షించుకోవాలి



మొక్కలు నాటుతున్న రోటరీక్లబ్ సభ్యులు, విద్యార్థినులు

గూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రోటరీక్లబ్ సభ్యులు అన్నారు. సోమవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో రోటరీక్లబ్, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నేచర్ కన్వర్షేషన్ డే సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, రోటరీక్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వర్లురెడ్డి, మునిగిరీష్, దశరధరామిరెడ్డి, మల్లు విజయ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గాయత్రి, ప్రశాంతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కోట ఇన్‌చార్జి ఎంపీడీవోగా వేణు

కోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కోట మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా వేణు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడి ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ బాపట్లలో నెలరోజులపాటు జరిగే శిక్షణకు వెళ్లారు. ఆయన వచ్చేంవరకు డిప్యూటీ ఎంపీడీవో వేణును ఇన్‌చార్జిగా నియమిస్తూ జిల్లా పరిషత్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేత

గూడూరు అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎమ్మెల్యే సునీల్ కుమార్ సహకారంతో వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు సోమవారం క్రీడాసామగ్రి అందజేశారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, మాధవయ్య, మస్తాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.